మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక
www.evarthalu.com

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శనివారం SATURDAY 6-6-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 12 PAGES:12 | వెల రూ.2.00 PRICE: 2.00
సంపుటి: 1 Volume:1 | సంచిక: 338 Issue: 338

06 జూన్ 2026 - శనివారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - తె. 5:44 సూర్యాస్తమయం - సా. 6:44 తిథి షష్ఠి రా. 2:39వ వరకు తరువాత సప్తమి సంస్కృత వారం స్థిర వాసరః నక్షత్రం శ్రవణ తె. 5:54 వరకు తరువాత ధనిష్ఠ యోగం ఇంద్ర ఉ. 9:53 వరకు కరణం గరజి మ. 2:01 వరకు నిజ రా. 2:39వ వరకు వర్జ్యం ఉ. 10:22 నుండి మ. 12:05 వరకు దుర్ముహూర్తం ఉ. 7:28 నుండి ఉ. 8:20 వరకు రాహుకాలం ఉ. 8:59 నుండి ఉ. 10:37 వరకు యమగండం మ. 1:52 నుండి మ. 3:29 వరకు గుళికాకాలం తె. 5:44 నుండి ఉ. 7:22 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:08 నుండి తె. 4:56 వరకు అమృత ఘడియలు రా. 8:42 నుండి రా. 10:25 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:48 నుండి మ. 12:40 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Circulated to Telangana
Published from Jagitial

# ఎక్కువ సదివినా తప్పే!

## ఎక్కువ విద్యార్హతలు ఉన్నా ఉద్యోగాలకు అర్హులు కారు.. సుప్రీంకోర్టు సంచలన తీర్పు



ప్రభుత్వ ఉద్యోగ నియామకాలకు సంబంధించి దేశ అత్యున్నత న్యాయస్థానం ఓ సంచలన తీర్పును ఇచ్చింది. ఏదైనా ఒక ఉద్యోగ నియామకానికి సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసినప్పుడు.. అందులో పేర్కొన్న నిర్దేశిత విద్యార్హతలు ఉన్న అభ్యర్థులను మాత్రమే పరిగణనలోకి తీసుకోవాలని స్పష్టం చేసింది. అంతకంటే ఎక్కువ చదువుకున్న అభ్యర్థులను ఆయా పోస్టులకు ఎంపిక చేయకూడదని న్యాయస్థానం తేల్చి చెప్పింది.

న్యూఢిల్లీ: తక్కువ అర్హత కలిగిన వారి కోసం కేటాయించిన ఉద్యోగాలను ఉన్నత విద్యావంతులకు కట్టబెడితే.. వాస్తవంగా ఆ పోస్టుకు అర్హులైన సామాన్య అభ్యర్థులకు ఘోర అన్యాయం జరుగుతుందని న్యాయస్థానం అభిప్రాయపడింది. తమిళనాడులోని ఒక బ్యాంకులో తాత్కాలిక ప్రాతిపదికన అటెండెంట్‌గా పని చేస్తున్న ఒక ఉద్యోగిని బ్యాంక్ యాజమాన్యం విధుల్లోంచి తొలగించింది. అయితే ఈ నిర్ణయాన్ని సవాలు చేస్తూ సదరు ఉద్యోగి మద్రాస్ హైకోర్టును ఆశ్రయించగా.. హైకోర్టు తరువాయి 2 వ పేజీలో...



# నీ పనే సక్కగ జేస్తలేవు!

## సుప్రీం కోర్టుపై మద్రాస్ హైకోర్టు అసహనం

## ఎన్నికల వివాదాల పరిష్కారంలో జాప్యంపై విమర్శ

ఎన్నికల వివాదాలను వీలైనంత త్వరగా పరిష్కరించాలని గతంలో తానే చేసిన వ్యాఖ్యలను సుప్రీంకోర్టు పాటించలేదని పేర్కొంటూ మద్రాస్ హైకోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. 2016 రాధాపురం అసెంబ్లీ ఎన్నికల వివాదానికి సంబంధించిన కేసును ఆరు సంవత్సరాలకు పైగా పెండింగ్‌లో ఉంచి, అనంతరం కీలక న్యాయపరమైన ప్రశ్నకు సమాధానం ఇవ్వకుండా తిరిగి హైకోర్టుకే పంపడాన్ని న్యాయమూర్తి జీ జయచంద్రన్ తప్పుబట్టారు.

చెన్నై: 2015లో మహమ్మద్ అక్బర్ వర్సెస్ అశోక్ సాహు కేసులో ఎన్నికల వివాదాలను త్వరితగతిన పరిష్కరించాల్సిన అవసరాన్ని సుప్రీంకోర్టే నొక్కిచెప్పిందని గుర్తుచేశారు. అయితే కోర్టులు తమ స్వంత పరిశీలనలను పట్టించుకోకపోతే, స్వాతంత్ర్యం అనంతరం ప్రజాస్వామ్య మార్గాన్ని విడిచిపెట్టిన కొన్ని దేశాల పరిస్థితి భారతదేశానికీ ఎదురయ్యే ప్రమాదం ఉందని వ్యాఖ్యానించారు. ఈ కేసులో ప్రధాన వివాదం పోస్టల్ బ్యాలెట్ల ధ్రువీకరణకు ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులను తరువాయి 2 వ పేజీలో...



# నీ పేరు కేసీఆరైతే రా!

### నీ పాలన, నా పాలనపై చర్చ పెడదాం
### పాలమూరు ద్రోహి.. నీ పార్టీని బొంద పెడ్త
### మీ పాపాలు కాశీకి పోయినా పోవు
### మా ప్రగతి రాస్తే రామాయణం.. చెప్తే భారతం
### జడ్చర్ల సభలో సీఎం రేవంత్ రెడ్డి

'పాలమూరు ప్రజలకు మట్టి తీసుడే కాదు.. నమ్మకద్రోహులను మట్టితో కప్పడం కూడా తెలుసు. కేసీఆర్ రాసిపెట్టుకో.. పాలమూరు జిల్లాలో మీ పార్టీని బొంద పెడతాం. రాబోయే ఎన్నికల్లో మీ పార్టీ తరపున ఒక్కరిని కూడా ఎమ్మెల్యేగా గెలవనీయం' అంటూ తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు.

జడ్చర్ల, జూన్ 5 (ఈవార్తలు): 'పాలమూరులో గెలిపించి గుండెల్లో పెట్టుకుంటే.. ఇక్కడి ప్రజలను మోసం చేసి గజ్వేల్‌కు పారిపోయిన కేసీఆర్ పాలమూరు ద్రోహి. మీ జిల్లా బిడ్డగా పుట్టి, ఈ మట్టి రుణం తీర్చుకోవడానికి అహర్నిశలు శ్రమిస్తున్న నేను పాలమూరు బిడ్డను' అని అన్నారు. జడ్చర్లలో నిర్వహించిన 'ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక' బహిరంగ సభలో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్, తరువాయి 2 వ పేజీలో...



# వచ్చేయ్‌రా.. బొద్దింకా!

సోషల్ మీడియాలో కోట్ల మంది అనుచరులను సంపాదించిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) జూన్ 6న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించనున్న నిరసన కార్యక్రమానికి సంబంధించిన మార్గదర్శకాలను విడుదల చేసింది. నీట్, సీబీఎస్ఈ, సీయూఈటీ, ఎస్ఎస్‌సీజీ తదితర పరీక్షల్లో చోటుచేసుకున్నట్లు ఆరోపణలు ఉన్న అవకతవకలు, ప్రశ్నపత్రాల లీకేజీలపై ప్రజలు తమ నిరసనను వ్యక్తం చేయాలని పార్టీ పిలుపునిచ్చింది.

### ఒక చేతిలో జాతీయ జెండా పట్టండి
### మరో చేతిలో పుస్తకంతో బయలుదేరండి
### ఫోన్‌తో అంతా రికార్డు చేయండి
### నిరుద్యోగులకు సీజేపీ పిలుపు
### ధర్నాపైనే యావత్ దేశం చూపు

న్యూఢిల్లీ: సీజేపీ ప్రతినిధులు విడుదల చేసిన వీడియోలో ప్రధాని మోదీ జోక్యం చేసుకుని కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. తరచూ ప్రశ్నపత్రాల లీకేజీలు జరుగుతున్న నేపథ్యంలో ఆయన బాధ్యత వహించాలని పేర్కొన్నారు. నిరసనలో పాల్గొనేవారికి సీజేపీ కొన్ని సూచనలు చేసింది. జాతీయ పతాకం, పుస్తకం వెంట తీసుకురావడం, జరిగే ప్రతి విషయాన్ని రికార్డు చేయడం, అల్లరి మూకలను గుర్తించి ఫిర్యాదు చేయడం, తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు

బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,622 |
| వెండి (కిలో): | రూ.2,90,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.5,938 |

# జాతీయ పార్టీలకు అర్థం కాదది

## మా అభిప్రాయాలు కలవలేదు.. పార్టీతో 18 నెలలుగా విభేదాలు

## అందుకే పార్టీకి గుడ్‌బై చెప్తున్నా.. రాజీనామా లేఖలో అన్నామలై



"గత 18 నెలలుగా పార్టీ అగ్రనేతలతో అనేకసార్లు చర్చలు జరిపాను. నా విభేదాలను కూడా స్పష్టంగా వ్యక్తం చేశాను. తమిళనాడులో అభివృద్ధి ఆధారిత, సాంస్కృతిక మూలాలు కలిగిన రాజకీయాల భవిష్యత్తుపై నా ఆలోచనలతో పార్టీ అగ్రనేతృత్వాన్ని మరింత ఇబ్బంది పెట్టాలని నేను కోరుకోవడం లేదు. సీనియర్ నాయకత్వంతో జరిగిన చర్చల అనంతరం తమిళనాడు విషయంలో మా అభిప్రాయాలు ఒకే దిశలో లేవని నేను నిర్ణయానికి వచ్చాను. తమిళనాడు ప్రజలు అర్థం చేసుకునే భాషలో జాతీయ పార్టీలు ఎప్పుడూ మాట్లాడలేదు. చాలా ఆలోచించిన తర్వాత నేను పార్టీ నుంచి బయటకు వచ్చి, రాజకీయాల్లోకి ఎందుకు వచ్చాననే అసలు లక్ష్యాన్ని మరోసారి ఆలోచించాల్సిన సమయం వచ్చిందని భావిస్తున్నా. భవిష్యత్తులో పరిస్థితులు నన్ను ఎటు తీసుకెళ్తాయో ఆ దిశగా నా ప్రయాణం కొనసాగుతుంది." - అన్నామలై

చెన్నై: తమిళనాడు రాజకీయ నేత కే అన్నామలై బీజేపీకి రాజీనామా చేశారు. ఈ అంశంపై ఆయన శుక్రవారం స్పందించారు. తాను కొత్త రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభించబోతున్నట్లు వెల్లడించారు. తాను స్వతంత్ర రాజకీయ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. తమిళనాడులో గత ఏడాదివరకు బీజేపీకి అధ్యక్షుడిగా పనిచేశారు అన్నామలై. అనంతరం పదవి నుంచి తొలగించినప్పటికీ ఆయన బీజేపీలోనే ఉన్నారు. తాజాగా బీజేపీకి రాజీనామా చేసినట్లు వెల్లడించారు. బీజేపీ కూడా ఆయన రాజీనామాను ఆమోదించింది. ఈ నేపథ్యంలో అన్నామలై డిజిటల్ మీడియా వేదికగా శుక్రవారం స్పందించారు. కొత్త రాజకీయ వేదికను ప్రారంభించబోతున్నట్లు చెప్పారు. వ్యక్తి కేంద్రంగా సాగే రాజకీయాలు కాకుండా కామన్ మ్యాన్ పాలిటిక్స్ చేస్తానన్నారు. తాను బీజేపీకి రాజీనామా చేశానని, ఇక నుంచి కొత్త ప్రయాణం ప్రారంభమవుతుందున్నారు. ఎప్పటిలాగే తనకు తరువాయి 2 వ పేజీలో...



# నీళ్లన్నీ నీళ్ల పాలాయే!


## తెలంగాణ జల హక్కులకు తీవ్ర ప్రమాదం

## కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే: హరీశ్ రావు

కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్యంతో తెలంగాణ జల హక్కులకు తీవ్ర ప్రమాదం మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఫ్లోర్ డిప్యూటీ లీడర్ హరీశ్ రావు ఆరోపించారు. ఈ మేరకు శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. ఎత్తిపోతల పంపుల నిర్వహణ విషయంలో 07-04-2026 నాడు లేఖ రూపంలో బీఆర్ఎస్ చేసిన హెచ్చరికలను ప్రభుత్వం పట్టించుకోలేదని మండిపడ్డారు. అందువల్లే నేడు పంపులు దెబ్బతిని, కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టుల నిర్వహణలో వైఫల్యం చెందారన్నారు.

హైదరాబాద్, జూన్ 5 (ఈవార్తలు): కృష్ణా జలాల వినియోగంలో తెలంగాణ కనిష్ఠ స్థాయికి పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏపీ 74 శాతం వినియోగిస్తే, తెలంగాణ 25 శాతానికే పరిమితమైందని పేర్కొన్నారు. రైతులు, తాగునీటి అవసరాలు, పరిశ్రమల భవిష్యత్తు ప్రమాదంలో పడేసిన కాంగ్రెస్ ప్రభుత్వం సోలార్ ఆధారిత విద్యుత్ విధానాలతో సాగునీటి రంగానికి ముప్పు ఉందని హెచ్చరించారు. అందుకే రైతు డిస్కం తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



అత్యంత అరుదుగా కనిపించే క్యాన్సర్ యువతలో వేగంగా పెరుగుతోంది. అమెరికాలో ఇటీవల నిర్వహించిన పరిశోధనల ప్రకారం, జెన్ ఎక్స్ , మిలీనియల్స్ తరాలకు చెందిన వ్యక్తుల్లో పాత తరాలతో పోలిస్తే అపెండిక్స్ క్యాన్సర్ బారిన పడే అవకాశాలు మూడు నుంచి నాలుగు రెట్లు ఎక్కువగా ఉన్నట్లు వెల్లడైంది. గతంలో అపెండిక్స్ క్యాన్సర్ ప్రధానంగా వృద్ధుల్లోనే కనిపించేది. అయితే ప్రస్తుతం పరిస్థితి మారింది. ఇప్పుడు అపెండిక్స్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ప్రతి ముగ్గురిలో ఒకరు 50 ఏళ్ల లోపు వయస్సు కలిగిన వారే అని అధ్యయనాలు చెబుతున్నాయి. అయితే దీనికి కారణం ఏమిటో శాస్త్రవేత్తలకు ఇప్పటికీ స్పష్టంగా తెలియడం లేదు.



# వృద్ధి రేటు 7.7 శాతం

### గత ఏడాదికి మించి వృద్ధి
### 2025--26 డేటా వెల్లడించిన కేంద్రం

న్యూఢిల్లీ: 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి భారత దేశం 7.7 శాతం జీడీపీ వృద్ధి రేటు సాధించింది. ఈ విషయాన్ని కేంద్ర ప్రభుత్వం శుక్రవారం వెల్లడించింది. గత ఏడాది వృద్ధి రేటు 7.1 శాతంకాగా, ఈ ఏడాది అంతకుమించి వృద్ధి రేటు సాధించింది. అంతర్జాతీయ సంక్షోభం, తరువాయి 2 వ పేజీలో...

# సిగ్గుండాలె రేవంత్

## ఏం ప్లానింగ్ లేదు.. చేతగాని దద్దమ్మవు.. శాతగాకపోతే రాజీనామా చెయ్.. ఎంపీ ధర్మపురి అరవింద్ ధ్వజం



గడ్డం మీసాలు లేకుండా తాను పార్టీలకు వచ్చానని.. ఇప్పటికీ తొమ్మిదేండ్లయితుందని.. గడ్డం తెల్లగైనా మళ్లా అదే సబ్జెక్టు మాట్లాడాల్సి వస్తుందని నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఏండ్లు గడుస్తున్నా హమాలీలు లేరు, సుతిలీలు లేవు, లారీలు లేవు అని చెప్పడానికి సీఎం రేవంత్ కు సిగ్గుండాలన్నారు. ఇవన్నింటికి కేంద్రమే పైసలు ఇస్తుందని తెలిపారు.

హైదరాబాద్, జూన్ 5 (ఈవార్తలు): నాంపల్లిలోని పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సకాలంలో ధాన్యం కొనకుండా నీ మార్కెటింగ్ శాఖ ఏం పీకుతుందని ప్రశ్నించారు. 'పాతాయన సంగతి వదిలేద్దాం. ఈయన సంగతే మాట్లాడదం. రెండేండ్లల్లో నాలుగు సీజన్ల మొత్తం ఎస్టిమేట్ 142.5 లక్షల మెట్రిక్ టన్నులు సరఫరా చేస్తమని ఒప్పుకున్నడు. కొనుగోలు చేసి అప్పజెప్పింది -2 వ పేజీలో...



# రెపో రేటు యథాతథం

### ఎలాంటి మార్పు లేదన్న ఆర్బీఐ

న్యూఢిల్లీ: రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్‌బీఐ) కీలక వడ్డీరేట్లను మరోసారి యథాతథంగా ఉంచింది. ఈ మేరకు ద్రవ్య పరపతి విధాన సమీక్ష నిర్ణయాలను ఆర్బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా శుక్రవారం వెల్లడించారు. ఈసారి రెపో రేటులో ఎలాంటి మార్పు లేదని, 5.25 శాతం వద్దే కొనసాగిస్తున్నట్లు తెలిపారు. కీలక తరువాయి 2 వ పేజీలో...

# రాశి ఫలాలు

6.6.2026

మేషం: చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. రాబడికి మించిన ఖర్చులు పెరుగుతాయి. బంధువులు ఒక ముఖ్యమైన వ్యవహారంలో మీ మాటతో విభేదిస్తారు. కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు. వృత్తి, వ్యాపారాలలో ఊహించని వివాదాలు కలుగుతాయి. ఉద్యోగంలో అదనపు బాధ్యతలు పెరుగుతాయి.

వృషభం: నూతన ఋణయత్నాలు చేస్తారు. ఆకస్మిక ప్రయాణ సూచనలున్నవి. బంధు మిత్రులతో ఆలయాలు సందర్శిస్తారు. చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. వృత్తి, వ్యాపారాలు మండకొడిగా సాగుతాయి. బంధువులతో మాటపట్టింపులు కలుగుతాయి.

మిథునం: ఇంటా బయట ఆశ్చర్యకర విషయాలు తెలుస్తాయి. ప్రముఖుల నుండి సహాయ సహకారాలు అందుతాయి. వ్యాపారాలు లాభసాటిగా సాగుతాయి. ఉద్యోగులకు నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. ఆర్థికంగా ఇబ్బంది ఉన్న అవసరానికి ధన సహాయం లభిస్తుంది.

కర్కాటకం: దాయాదులతో భూ వివాదాలు కలుగుతాయి. ఆర్థిక వ్యవహారాలలో ఒడిదుడుకులు ఉంటాయి. ప్రయాణాలలో వాహన ఇబ్బందులు ఉంటాయి. దైవ చింతన పెరుగుతుంది. వృత్తి, వ్యాపారాలు మందగిస్తాయి. ఉద్యోగమున సహోద్యోగులతో మాట పట్టింపులు ఉంటాయి.

సింహం: ప్రముఖుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. చేపట్టిన పనులు విజయవంతంగా సాగుతాయి. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. వృత్తి, వ్యాపారాలలో నూతన ప్రోత్సాహకాలు అందుకుంటారు. విద్యార్థుల శ్రమ ఫలిస్తుంది. నిరుద్యోగుల కలలు నిజమవుతాయి.

కన్య: వృథా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. చేపట్టిన కార్యక్రమాలలో ఆటంకాలు ఉంటాయి. చిన్నపాటి అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. కుటుంబ సభ్యులతో మనస్పర్థలు కలుగుతాయి. చిన్ననాటి మిత్రులతో విభేదిస్తారు. వృత్తి, వ్యాపారాలలో సమస్యలు తప్పవు.

తుల: సంతానానికి నూతన విద్యావకాశాలు లభిస్తాయి. పాత మిత్రుల కలయిక ఆనందం కలిగిస్తుంది. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలు మరింత ఉత్సాహాన్నిస్తాయి. నూతన వస్తు లాభాలు పొందుతారు.

వృశ్చికం: నూతన కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. దీర్ఘకాలిక వివాదాలకు సంబంధించి ఆప్తుల సలహాలు స్వీకరిస్తారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో దీర్ఘకాలిక సమస్యల నుంచి గట్టెక్కుతారు. వ్యాపారాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

ధనస్సు: దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది. బంధువులతో ఒక విషయంలో మాటపట్టింపులు కలుగుతాయి. చేపట్టిన పనుల్లో కొంత జాప్యం తప్పదు. ఆరోగ్య సమస్యలు బాధిస్తాయి. దైవదర్శనాలు చేసుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో కొంత గందరగోళ పరిస్థితులు ఉంటాయి.

మకరం: ఆర్థికంగా ఇబ్బందికర పరిస్థితి ఉంటుంది. అవసరం లేని వస్తువులపై ధన వ్యయం చేస్తారు. బంధువులతో మాటపట్టింపులు కలుగుతాయి. వృత్తి వ్యాపారాలలో ఆలోచనలు నిలకడగా ఉండవు. ఉద్యోగమున శ్రమాధిక్యత పెరుగుతుంది. ఋణదాతల నుండి ఒత్తిడి అధికమవుతుంది.

కుంభం: ఆర్థిక పరిస్థితి గతం కంటే మెరుగుపడుతుంది. చేపట్టిన వ్యవహారాలలో పురోగతి సాధిస్తారు. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. వృత్తి, వ్యాపారాలలో కొంత అనుకూల వాతావరణం ఉంటుంది. చిన్ననాటి మిత్రుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుకుంటారు. ఉద్యోగస్తులకు ఆశించిన స్థాన చలనాలు కలుగుతాయి.

మీనం: చేపట్టిన పనులలో కార్యసిద్ధి కలుగుతుంది. స్థిరాస్తి వివాదాలు పరిష్కారమవుతాయి. ప్రముఖుల సహాయంతో కొన్ని సమస్యలు పరిష్కరించుకుంటారు. వృత్తి, వ్యాపారాలలో ఒత్తిడులు అధిగమిస్తారు. కీలక వ్యవహారంలో సన్నిహితుల నుండి విలువైన సమాచారం సేకరిస్తారు.

## ఎక్కువ సదివినా తప్పే!

మొదటి పేజీ తరువాయి

అతడికి అనుకూలంగా తీర్పునిస్తూ తిరిగి ఉద్యోగంలోకి తీసుకోవాలని బ్యాంకును ఆదేశించింది. ఈ ఆదేశాలను సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను సుప్రీం కోర్టు న్యాయమూర్తులు జస్టిస్ అహసానుద్దీన్ అమానుల్లా, జస్టిస్ ఆర్. మహాదేవన్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. హైకోర్టు ఇచ్చిన పాత ఆదేశాలను పూర్తిగా పక్కన పెడుతూ.. ఉద్యోగిని తొలగిస్తూ బ్యాంకు తీసుకున్న నిర్ణయం సరైనదేనని సుప్రీం కోర్టు సమర్థించింది. ఈ కేసులో సదరు అభ్యర్థి తాను పట్టభద్రుడననే అసలు నిజాన్ని యాజమాన్యం వద్ద దాచాడని సుప్రీంకోర్టు ధర్మాసనం ఎత్తిచూపింది. కేవలం పదో తరగతి అర్హత ఉన్న పేద అభ్యర్థులకు దక్కాల్సిన అటెండెంట్ ఉద్యోగాన్ని.. తప్పుడు సమాచారంతో దక్కించుకున్నాడని కోర్టు పేర్కొంది. ఈ ముఖ్యమైన వాస్తవాన్ని మద్రాస్ హైకోర్టు సరిగ్గా పరిగణనలోకి తీసుకోలేకపోయిందని వ్యాఖ్యానించింది. ప్రభుత్వ లేదా ప్రభుత్వ రంగ ఉద్యోగాలు అనేవి ఎప్పుడైనా సరే ఆయా పోస్టులకు నిర్దేశించిన కచ్చితమైన అర్హతలు ఉన్నవారికే చెందాలని స్పష్టం చేసింది.

## నీ పనే సక్కగ జేస్తలేవు!

మొదటి పేజీ తరువాయి

గెజిటెడ్ అధికారులుగా పరిగణించవచ్చా? లేదా? అన్నదేనని తెలిపారు. 2016 ఎన్నికల్లో రిటర్నింగ్ అధికారి 203 పోస్టల్ ఓట్లను తిరస్కరించడంతో డీఎంకే అభ్యర్థి ఎం అప్పావు కేవలం 49 ఓట్ల తేడాతో ఓడిపోయినట్లు ప్రకటించారని పేర్కొన్నారు. తిరస్కరించిన ఓట్లలో 153 అప్పావుకు, కేవలం ఒక ఓటు మాత్రమే ప్రత్యర్థి ఐ.ఎస్. ఇంబదురైకి వచ్చినట్లు రికార్డులు సూచిస్తున్నాయని తెలిపారు. ఈ అంశంపై హైకోర్టు ఇప్పటికే 2019 అక్టోబర్ 1న ప్రధానోపాధ్యాయులు పోస్టల్ బ్యాలెట్లను ధ్రువీకరించే అధికారం కలిగి ఉన్నారని స్పష్టంగా తేల్చి, పోస్టల్ ఓట్ల పునఃలెక్కింపునకు ఆదేశాలు జారీ చేసిందని గుర్తుచేశారు. అయితే ఆ ఉత్తర్వులను సవాల్ చేస్తూ ఇంబదురై సుప్రీంకోర్టును ఆశ్రయించారు. పోస్టల్ ఓట్ల పునఃలెక్కింపు జరుగుతున్న సమయంలో సుప్రీంకోర్టు ఫలితాల ప్రకటనను తాత్కాలిక నిలుపుదల చేసింది. అనంతరం పలుమార్లు వాయిదాలు పడిన ఈ కేసును సుప్రీంకోర్టు 2026 మే 26న పరిష్కరిస్తూ, న్యాయపరమైన ప్రశ్నను భవిష్యత్ కేసులకు వదిలేసి, ఎన్నికల పిటిషన్‌పై హైకోర్టు విచారణ కొనసాగించేందుకు అనుమతించింది. దీంతో మద్రాస్ హైకోర్టు 2026 జూన్ 3న తీర్పు వెలువరించి, అప్పావు 2016 రాధాపురం నియోజకవర్గంలో 103 ఓట్ల మెజారిటీతో గెలిచినట్లు ప్రకటించింది. ఇంబదురై ఎన్నికను చెల్లనిదిగా ప్రకటించడంతో పాటు, ఆయన పొందిన అన్ని అనుబంధ ప్రయోజనాలను కూడా రద్దు చేయాలని ఆదేశించింది. కేసు పరిష్కారానికి పదేళ్ల సమయం పట్టడంపై ఆవేదన వ్యక్తం చేసిన న్యాయమూర్తి, ఇది 'దురదృష్టకరం' అనే పదంతోనే సరిపెట్టలేమన్నారు. న్యాయం పేరుతో ప్రజాస్వామ్య వ్యవస్థకే అపహాస్యం జరిగిందని, రాధాపురం నియోజకవర్గ ప్రజలు చట్టబద్ధంగా ఎన్నిక కాలేని వ్యక్తిని తమ శాసనసభ ప్రతినిధిగా భరించాల్సి వచ్చిందని వ్యాఖ్యానించారు. 1951 ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 86(7) ప్రకారం ఎన్నికల పిటిషన్లను సాధ్యమైనంత త్వరగా, సాధారణంగా ఆరు నెలల్లోపు పరిష్కరించాల్సి ఉన్నప్పటికీ, ఈ కేసులో ఆ నిబంధనను పూర్తిగా విస్మరించారని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య పరిరక్షణలో న్యాయవ్యవస్థ కీలక పాత్ర పోషించాలని, ఎన్నికల వివాదాల పరిష్కారంలో జాప్యం ప్రజాస్వామ్య స్ఫూర్తిని దెబ్బతీస్తుందని జస్టిస్ జయచంద్రన్ హెచ్చరించారు. ముఖ్యంగా సార్వత్రిక ఓటు హక్కు విలువను కాపాడాలంటే ఎన్నికల పిటిషన్లను వేగంగా పరిష్కరించడం అత్యవసరమని స్పష్టం చేశారు.

# నీ పేరు కేసీఆరైతే రా!




మొదటి పేజీ తరువాయి

బీజేపీలపై నిప్పులు చెరిగారు. జిల్లాలో వలసల కష్టాలు, ఆత్మహత్యల నష్టాలు స్వయంగా చూసిన వ్యక్తినని, అందుకే రెండు రోజులుగా జిల్లాలోనే ఉండి సాగునీటి ప్రాజెక్టులను స్వయంగా పరిశీలిస్తున్నానని తెలిపారు. పాలమూరు ప్రజలకు ఊరు లేకపోయినా, పార్లమెంటులో నోరు లేకపోయినా.. గతంలో ఇక్కడికి రాజకీయంగా వలసవచ్చిన కేసీఆర్‌ను ప్రజలు ఆదరించారని సీఎం గుర్తుచేశారు. కానీ కేసీఆర్ 'మేకవన్నె పులి' అని గుర్తించక రెండుసార్లు సీఎంను చేస్తే.. పదేళ్లలో జిల్లాలోని ఏ ఒక్క ప్రాజెక్టూ పూర్తి చేయలేదని మండిపడ్డారు. ఉద్దండాపూర్ మునిగితే పరిహారం కోసం రూ. 800 కోట్లు ఇవ్వకుండా, నిర్వాసితులను జైల్లో పెట్టి కొట్టించిన చరిత్ర కేసీఆర్‌దని ఆగ్రహం వ్యక్తంచేశారు. 'దొంగలకు సద్దులు మోసేటోళ్లు ఇప్పుడు జిల్లాలో పాదయాత్రలు చేస్తారట. పాదయాత్ర కాదు.. కాశీ దాకా పోయి పొర్లుదండాలు పెట్టినా మీరు చేసిన పాపాలు తొలిగిపోవు. పంచలు కట్టుకుని ఊర్లలోకి వస్తే ఇక్కడి ప్రజలు ఉరికించి కొడతారు జాగ్రత్త' అని హెచ్చరించారు.

### కేసీఆర్.. అసెంబ్లీకి రా

బీఆర్ఎస్ పదేళ్ల పాలనకు, తమ రెండున్నరేళ్ల (30 నెలల) పాలనకు అసెంబ్లీలో చర్చకు రావాలని కేసీఆర్‌కు సీఎం రేవంత్ రెడ్డి సవాల్ విసిరారు. "నీ పేరు కేసీఆర్ అయితే చర్చకు రా. మాది తప్పైతే నేను క్షమాపణ చెబుతా. మీరు జైళ్లు కట్టాలని చూస్తే.. మేం స్కూళ్లు కట్టాలని చూశాం. పిల్లల జీవితాల్లో వెలుగులు నింపేందుకు కొడంగల్‌లో భారీ ఎడ్యుకేషన్ హబ్‌ను నిర్మిస్తున్నాం. పిల్లలను చదివించండి.. చదువుకుంటేనే బతుకులు బాగుపడతాయి" అని పిలుపునిచ్చారు. హనుమాండ్ల గుడి లేని తండా ఉండొచ్చేమో కానీ.. ఇందిరమ్మ ఇల్లు లేని గూడెం లేదని, తాము అధికారంలోకి వచ్చాక సాధించిన ప్రగతి 'రాస్తే రామాయణం.. చెబితే భారతం' అంత ఉందని రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. తమ పాలనలో 15 లక్షల రేషన్ కార్డులు, 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, 50 లక్షల కుటుంబాలకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తూ.. మహిళల ఉచిత బస్సు ప్రయాణం కోసం రూ. 10 వేల కోట్లు ఖర్చు చేశామని వివరించారు.

### పాలమూరులో బీఆర్ఎస్‌ను బొందపెడతాం

'నేను జడ్పీటీసీగా ఉన్నప్పుడు మీరు నాటిన మొక్క.. ఈరోజు ముఖ్యమంత్రిగా వృక్షమై మీ ముందుకు వచ్చింది. మీ పాలమూరు బిడ్డగా ఈ 30 నెలల్లోనే జిల్లా ప్రాజెక్టుల కోసం రూ. 8 వేల కోట్లు ఖర్చు చేశా. పాలమూరు ప్రజలకు మట్టి తీసుడే కాదు.. నమ్మకద్రోహులను మట్టితో కప్పడం కూడా తెలుసు. కేసీఆర్ రాసిపెట్టుకో.. పాలమూరు జిల్లాలో మీ పార్టీని బొంద పెడతాం. రాబోయే ఎన్నికల్లో మీ పార్టీ తరఫున ఒక్కరిని కూడా ఎమ్మెల్యేగా గెలవనీయం' అని వెల్లడించారు. రాష్ట్రంలో 2034 వరకు కాంగ్రెస్ పార్టీదే అధికారమని, 2029లో మళ్లీ 'ఔర్ ఏక్ బార్.. కాంగ్రెస్ సర్కార్' రావడం ఖాయమని సవాల్ విసిరారు.

### తుమ్మిడిహెట్టి కట్టి తీరుతాం

గోదావరి జలాల విషయంలో మహారాష్ట్ర ముఖ్యమంత్రి దాగుడుమూతలాడుతున్నారని, బీజేపీ నేతలు కూడా సమాధానం చెప్పలేక తప్పించుకు తిరుగుతున్నారని సీఎం విమర్శించారు. 'ఎవరు ఎన్ని దాగుడుమూతలాడినా వదిలేది లేదు. అడుగుతాం.. కడుగుతాం.. తుమ్మిడిహెట్టి కట్టి తీరుతాం. మీరు బురద చల్లినా, తలకిందులుగా తపస్సు చేసినా పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు 90 టీఎంసీల నీటిని ఒప్పించే బాధ్యత, గ్రీన్ చానల్ ద్వారా నిధులు మంజూరు చేసే బాధ్యత నాది' అని స్పష్టం చేశారు. జిల్లాలో వలసలు ఆగాలన్నా, రైతులు సంతోషంగా ఉండాలన్నా.. ప్రాజెక్టులు పూర్తి కావాలని, దొంగలు, దోపిడీదారులు, దొంగలకు సద్దులు మోసేటోళ్లు వస్తుంటారు.. పాలమూరు బిడ్డలు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు.

## జాతీయ పార్టీలకు అర్థం కాదది

మొదటి పేజీ తరువాయి



అందరి మద్దతు కావాలని కోరారు. పారదర్శకత, విలువలు, ప్రజాసేవ లక్ష్యంగా, స్వచ్ఛమైన, అన్నిస్థాయిల నుంచి వేదికగా నిలిచే రాజకీయ ఉద్యమాన్ని ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. తన రాజకీయ ఉద్యమం రాజకీయ పార్టీగా మారిన తర్వాత నాయకత్వానికి సంబంధించి కొత్త మార్గదర్శకాలు నిర్ణయిస్తానన్నారు. నాయకత్వానికి పరిమితులు పెడతానని, కాలపరిమితి నిర్ణయిస్తానని, వారసత్వ రాజకీయాలకు దూరంగా ఉంటానని చెప్పారు. పార్టీలో అంతర్గత ప్రజాస్వామ్యాన్ని ప్రోత్సహిస్తానని వివరించారు. ఇప్పటివరకు రాజకీయ పార్టీలు సంప్రదాయబద్ధంగా అమలు చేస్తున్న వ్యక్తి కేంద్రంగా సాగే రాజకయాలకు దూరంగా, సామాన్యుడి రాజకీయంగా తన వేదిక నిలుస్తుందన్నారు. రాజకీయాలు ఒక వ్యక్తి చుట్టూ తిరగడం సరికాదన్నారు. తన రాజకీయ ఉద్యమంలో చేరిన వారికి ఏపీజే అబ్దుల్ కలాం ఎథిక్స్ ఇన్ పాలిటిక్స్ ఇనిస్టిట్యూషన్‌లో తగిన శిక్షణ ఇస్తామన్నారు. బీజేపీకి తాను గత ఏడాది డిసెంబర్‌లోనే రాజీనామా చేస్తానని చెప్పానని, కానీ, ఎన్నికల వరకు ఆగాలని చెప్పడంతో ఆగానని అన్నారు. తనకు ఇంతకాలం అవకాశం ఇచ్చిన బీజేపీకి కృతజ్ఞతలు తెలిపారు. తమిళనాడులో వచ్చే అసెంబ్లీ ఎన్నికలే లక్ష్యంగా పని చేస్తామన్నారు.

## నీళ్లన్నీ నీళ్ల పాలాయే!

మొదటి పేజీ తరువాయి

ప్రతిపాదనను వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ ఇవ్వాలని, కాళేశ్వరం, దేవాదుల నిర్వహణకు తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ భవిష్యత్తును ప్రశ్నార్థకం చేయకుండా జల హక్కులు కాపాడాలి అంటూ రేవంత్ రెడ్డికి లేఖ రాసిన లేఖలో హరీశ్ రావు పేర్కొన్నారు.

## రెపో రేటు యథాతథం

మొదటి పేజీ తరువాయి

వడ్డీరేట్లను ఆర్‌బీఐ సవరించకపోవడం వరుసగా ఇది మూడోసారి కావడం గమనార్హం. ఇంతకుముందు ఈ ఏడాది (2026) ఫిబ్రవరి, ఏప్రిల్ నెలల్లో జరిగిన ద్రవ్య పరపతి సమీక్షల్లోనూ రిజర్వ్ బ్యాంక్ వడ్డీరేట్లను మార్చకుండా ఇలాగే ఉంచింది. అంతర్జాతీయ మార్కెట్లో అస్థిరత, పశ్చిమాసియా సంక్షోభం కొనసాగుతున్న తరుణంలో దేశీయ ఆర్థిక వ్యవస్థను సురక్షితంగా ఉంచేందుకే ఆర్‌బీఐ ఈ నిర్ణయం తీసుకున్నట్టు ప్రకటించింది.

## వృద్ధి రేటు 7.7 శాతం

మొదటి పేజీ తరువాయి

యుద్ధ వాతావరణం ఉన్నప్పటికీ దేశం భారీగా జీడీపీ వృద్ధిరేటు సాధించిందని కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ వెల్లడించింది. అందులోనూ గత జనవరి నుంచి మార్చి వరకు త్రైమాసికంలో 7.8 శాతం వృద్ధి నమోదైనట్లు తెలిపింది. ఇది భారత ఆర్థిక వ్యవస్థకు బలాన్నిచ్చేదే. ఈ ఏడాది అరుదైన ఫలితాలు సాధించడంలో తయారీ, సేవలు, వాణిజ్య రంగాలతోపాటు, వ్యవసాయం, మత్స్య రంగాలు కూడా కీలకంగా మారాయి. 2022–23 నాటి స్థిర ధరల అంచనా ప్రకారం ఈ ఏడాది జీడీపీ 323.12 లక్షల కోట్లకు చేరుకుంది. అంతకుముందు సంవత్సరం.. అంటే 2025 ఆర్థిక సంవత్సరంలో ఇది 299.89 లక్షల కోట్లుగా ఉంది. ద్రవ్యోల్బణాన్ని కూడా పరిగణనలోకి తీసుకుంటే సాధారణ జీడీపీ రేటు 8.9 శాతానికి పెరిగింది. అంటే దీని విలువ గత ఏడాది 318.07 లక్షల కోట్ల నుంచి ఈ ఏడాది 346.36 లక్షల కోట్లకు చేరింది.

# వచ్చేయ్‌రా.. బొద్దింకా!

మొదటి పేజీ తరువాయి

ఎండ తీవ్రత దృష్ట్యా సన్‌స్క్రీన్ వాడడం, టోపీ ధరించడం, తగినంత నీరు తాగడం వంటి సూచనలు చేసింది. అలాగే ఒంటరిగా రాకూడదని, ఎవరినీ రెచ్చగొట్టకూడదని, పూలను విసరడం కాకుండా అందించాలని, ట్రోల్స్ లేదా ప్రేరేపించే వ్యక్తులతో వాగ్వాదాలకు దిగకూడదని, ఆకలితో నిరసనకు రావద్దని సూచించింది. అటు.. పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే భారత్‌కు బయలుదేరినట్లు తెలిపారు. ఢిల్లీ విమానాశ్రయానికి పెద్ద సంఖ్యలో మద్దతుదారులు రావద్దని దీప్కే విజ్ఞప్తి చేశారు.

ఢిల్లీ పోలీసులు అప్రమత్తం

సీజేపీ ధర్నా నేపథ్యంలో ఢిల్లీ పోలీసులు అప్రమత్తమయ్యారు. అయితే, ఇప్పటి వరకు ఆ పార్టీ నుంచి అధికారికంగా అనుమతి కోరుతూ ఎలాంటి దరఖాస్తు అందలేదని ప్రకటించారు. సీజేపీ వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కే శనివారం నిరసన ప్రదర్శనలో పాల్గొంటున్నట్లు ప్రకటించడంతో నిరసనపై పోలీసులు ఓ కన్నేసి ఉంచారు. ఢిల్లీ పోలీసుల ప్రకారం.. జంతర్ మంతర్ వద్ద ఎలాంటి కార్యక్రమం నిర్వహించాలన్నా ముందుగా అనుమతి తీసుకోవాల్సిందే. దరఖాస్తు అందితే భద్రతా పరిస్థితులు, పరిపాలన అంశాలు, శాంతిభద్రతల దృష్ట్యా పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని పోలీసులు చెప్పారు. నిబంధనల ప్రకారం అనుమతి ఇవ్వాలా లేదా అనేది నిర్ణయిస్తామని పేర్కొన్నారు.



# సిగ్గుండాలె రేవంత్

మొదటి పేజీ తరువాయి

106.78 లక్షల మెట్రిక్ టన్నులు. 35.72 లక్షల మెట్రిక్ టన్నులు ఎఫ్‌సీఐకి ఇంకా నువ్ బాకీ ఉన్నవ్. ఇది ఈన పనితీరు. రేవంత్ భాషల చెప్పాలంటే సిగ్గుండాలి. రైతుల మీద పనికిమాలిన రాజకీయం చేయడానికి సిగ్గు, లజ్జ ఉండాలే. శాతగాని దద్దమ్మ నువ్వు. పంజాబ్‌లో అనుకున్నదాని కంటే 240 లక్షల మెట్రిక్ టన్నులు ఇస్తా అన్నరు. 220 ఇచ్చిర్రు. 8 శాతం ఇంకా మిగిలింది. ఛత్తీస్‌గఢ్ 151 ఇస్తా అన్నది 151 లక్షల మెట్రిక్ టన్నులు ఇచ్చిర్రు. తెలంగాణలో 27.05 శాతం మీరు ఇంకా అప్పజెప్పలే. ఒడిశాలో 112 లక్షల మెట్రిక్ టన్నులకు 108 లక్షల మెట్రిక్ టన్నులు.. కేవలం మూడున్నర శాతం తక్కువ. ఉత్తరప్రదేశ్ 80 లక్షల మెట్రిక్ టన్నుల ఇస్తా అని 80.4 లక్షల మెట్రిక్ టన్నులు ఇచ్చారు. ఇది బీజేపీ రూల్' అని అరవింద్ స్పష్టం చేశారు.

ఇసుకకు లారీల కొరత ఉందని ఎన్నడన్నా ఇన్నమా?

ఇసుక తరలించడానికి లారీలొస్తయ్.. దొంగ ఇసుక, దొంగ మొరం తీస్కపోనికి లారీల కొరతనే ఉండదు. ఎన్నడన్న ఇన్నమా? లారీల కొరతతోటి ఇసుక దందా ఆగిందని. ఇంతకుముందు బీఆర్ఎసోళ్లు చేసిర్రు. వడ్లకే లారీల కొరత వస్తది. నువ్ ఇయ్యాల్సినవి ఇంకా 36 లక్షల మెట్రిక్ టన్నులు ఇచ్చేస్తవ్. మక్కలన్నీ 400, 500 రూపాలకు తక్కువకు అమ్ముకున్నంక అప్పుడు పెడుతరు వీళ్లు అని ఆయన ఫైరయ్యారు. 'ఈయన ఒక ముఖ్యమంత్రి హోదాలో ఉండి బీజేపీ ఆఫీస్ ముందర పారబోస్తా, కిషన్‌రెడ్డి ఇంటి ముందర పారబోస్తా, అరవింద్ ఇంటి ముందర పారబోస్తా ఇదా చేతగానితనం. రైతుల గోస వుచ్చుకుంటున్నవ్. రాష్ట్రానికి నీవల్ల అరిష్టం వుచ్చుకుంది. లిల్లి ఇస్ వెరీ సిల్లి.. ఇప్పట్నుంచి నేన్ లిల్లి అంటా. లిల్లి అంటే లిల్లిపుట్ అని ఎపీ ధర్మపురి వ్యాఖ్యానించారు.





# రూ.30,000 కోట్ల భూమి సేఫ్

## 198 ఎకరాల భూమిని కాపాడిన హైడ్రా.. పుప్పాలగూడలో ప్రభుత్వ భూమికి కంచె

రంగారెడ్డి, జూన్ 5 (ఈవార్తలు): ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా హైడ్రా ఒక భారీ ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టింది. దశాబ్దాలుగా వివాదాల్లో నలుగుతూ, కబ్జాదారుల కబంధ హస్తాల్లో చిక్కుకునే ప్రమాదంలో ఉన్న అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని రక్షించింది. రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం పుప్పాలగూడ-ఖాజాగూడ సరిహద్దుల్లో ఉన్న 198 ఎకరాల ప్రభుత్వ భూమిని శుక్రవారం హైడ్రా తన ఆధీనంలోకి తీసుకుంది. సుమారు రూ.30,000 కోట్ల విలువ చేసే ఈ భూమిలో 250 కోట్ల సంవత్సరాల నాటి అరుదైన చారిత్రక రాతి గుట్టలు కూడా ఉండటం విశేషం. ఈ ఆపరేషన్‌తో అమూల్యమైన ప్రకృతి, చారిత్రక సంపదకు హైడ్రా రక్షణ కవచం ఏర్పాటు చేసింది. గతంలో రాష్ట్ర ప్రభుత్వం హెచ్ఎండీఏకు కేటాయించిన ఈ భూమిలో అద్భుతమైన రాతి శిలలు, గుహలు, పచ్చని చెట్లు ఉన్నాయి. ఈ చారిత్రక సంపదను కాపాడాలంటూ 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు దశాబ్దాలుగా న్యాయపోరాటం చేస్తున్నారు. వారి పిటిషన్‌పై విచారణ జరిపిన హైకోర్టు, 2019లోనే ఈ రాతి గుట్టలతో పాటు ప్రభుత్వ భూమిని సంరక్షించాలని మున్సిపల్, రెవెన్యూ శాఖలను ఆదేశించింది. అయితే, హద్దులు గుర్తించి ఫెన్సింగ్ వేయడంలో జాప్యం జరగడంతో భూమి కబ్జాకు గురయ్యే ప్రమాదం ఏర్పడింది. దీంతో 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదుపై హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ వెంటనే స్పందించి, క్షేత్రస్థాయిలో పర్యటించారు. రెవెన్యూ, మున్సిపల్ అధికారులతో కలిసి సంయుక్తంగా సర్వే నిర్వహించి, భూమిని ప్రభుత్వ ఆస్తిగా నిర్ధారించుకున్నారు. అనంతరం శుక్రవారం పటిష్టమైన ఫెన్సింగ్ ఏర్పాటు చేసే కార్యక్రమాన్ని చేపట్టారు. రెవెన్యూ రికార్డుల ప్రకారం.. సర్వే నంబర్ 452/1లో 174 ఎకరాలు, 454/1లో 119.05 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఇందులో ఓవర్‌ల్యాప్ సమస్యల కారణంగా 63.05 ఎకరాలు ప్రైవేటు వ్యక్తులకు చెందినదిగా గుర్తించి, మిగిలిన భూమిలో దేవాలయాలకు 5 ఎకరాలు, దర్గాకు 5 ఎకరాలు కేటాయించగా, నికరంగా 200 ఎకరాల హెచ్ఎండీఏ భూమిని హైడ్రా కాపాడింది. ఈ ఆపరేషన్‌పై 'సొసైటీ టు సేవ్ రాక్స్' ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. సహజ సిద్ధమైన వ్యూ పాయింట్లు, చారిత్రక గుట్టలను కాపాడి, అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసినందుకు హైడ్రాను అభినందించారు. స్థానిక ప్రజలు, పర్యావరణ ప్రేమికులు సైతం ప్రభుత్వ చొరవను కొనియాడారు. ఇదే సమయంలో, ఈ గుట్టలను ఆనుకుని ఉన్న భగీరథమ్మ చెరువును కూడా హైడ్రా పునరుద్ధరిస్తోంది. ఒకవైపు ఎత్తైన కొండలు, మరోవైపు జలకళతో నిండిన చెరువుతో ఈ ప్రాంతం భవిష్యత్తులో ఒక అద్భుతమైన పర్యాటక కేంద్రంగా విరాజిల్లుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## నదిలో దిగి ముగ్గురి మృతి

### కామారెడ్డి జిల్లాలో విషాదం

కామారెడ్డి, జూన్ 5 (ఈవార్తలు): కామారెడ్డి జిల్లాలో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మంజీరా నదిలో స్నానానికి దిగి ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ ఘటన బాన్సువాడ మండల పరిధిలో శుక్రవారం జరిగింది. వివరాల్లోకి వెళితే.. పిట్లం మండలం మంగళ్ కిష్టాపూర్ గ్రామానికి చెందిన నలుగురు కుటుంబ సభ్యులు బాన్సువాడ మండలం బుడిమి సమీపంలోని ఎల్లమ్మ ఆలయానికి మొక్కులు చెల్లించుకోవడానికి వెళ్లారు. దర్శనం అనంతరం దగ్గరలోని మంజీరా నదిలో పుణ్యస్నానం చేసేందుకు దిగారు. అయితే, నీటి లోతు, ప్రవాహం ఎక్కువగా ఉండటంతో వారు అదుపుతప్పి గల్లంతయ్యారు. వారి అరుపులు విన్న స్థానికులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో భాను ప్రసాద్ అనే వ్యక్తిని సురక్షితంగా ఒడ్డుకు చేర్చగలిగారు. కానీ, అప్పటికే అనిత (40), ఆమె కుమార్తెలు పావని (14), శివాని (13) నీట మునిగి మృతి చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, స్థానికుల సహాయంతో మృతదేహాలను వెలికితీశారు. ఒకే కుటుంబంలో తల్లి, ఇద్దరు కుమార్తెలు మరణించడంతో వారి గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తమిళనాడులో వైసీపీ మాజీ ఎమ్మెల్యే అరెస్ట్.. హైదరాబాద్‌కు తరలింపు

హైదరాబాద్, జూన్ 5 (ఈవార్తలు): హైదరాబాద్ లోని గండిపేట పరిధిలో గల ప్రభుత్వ భూమి కబ్జా కుట్ర కేసులో ఒక సంచలన మలుపు చోటుచేసుకుంది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడును పోలీసులు ఎట్టకేలకు అరెస్ట్ చేశారు. తమిళనాడులోని కాంచీపురంలో తలదాచుకున్న ఆయనను పోలీసులు శుక్రవారం వ్యూహాత్మకంగా అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అక్కడి నుండి హైదరాబాద్‌కు తరలించారు. ప్రస్తుతం నిందితుడిని కోర్టులో హాజరుపరిచేందుకు పోలీసులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ హైప్రొఫైల్ అరెస్ట్ కోసం సైబరాబాద్ ఎకనామిక్ అఫెన్సెస్ వింగ్, నార్సింగి పోలీసులు సంయుక్తంగా వ్యవహరించారు. అత్యంత రహస్యంగా ఆపరేషన్ నిర్వహించి బ్రహ్మనాయుడును పట్టుకున్నట్లు సైబరాబాద్ పోలీసులు అధికారికంగా ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ భూమిని చేజిక్కించుకునేందుకు నిందితులు పెద్ద స్కెచ్చే వేసినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు. ఈ కేసులో కేవలం కబ్జా యత్నమే కాకుండా... భూమికి సంబంధించిన నకిలీ డాక్యుమెంట్లను ఫోర్జరీ ద్వారా తయారు చేయడం, ప్రభుత్వ అధికారుల లేదా ఇతరుల సంతకాలను దుర్వినియోగం చేయడం, ఈ ల్యాండ్ స్కామ్ వెనుక జరిగిన కోట్ల రూపాయల నల్లధనం చేతులు మారడం వంటి కోణాలపై పోలీసులు నిఘా పెట్టారు. ఈ భారీ భూ కుట్రలో బొల్లా బ్రహ్మనాయుడుతో పాటు తెరవెనుక ఉన్న ఇతర కుట్రదారులు, రాజకీయ నేతలు, కొందరు అధికారుల పాత్రపై కూడా ప్రస్తుతం లోతైన దర్యాప్తు కొనసాగుతోందని సైబరాబాద్ పోలీస్ శాఖ స్పష్టం చేసింది. ఈ అరెస్ట్‌తో హైదరాబాద్ చుట్టుపక్కల ల్యాండ్ గ్రాబింగ్ వ్యవహారాలపై మరోసారి చర్చ జోరందుకుంది.

## గాదె ఇన్నయ్యకు మధ్యంతర బెయిల్

నాంపల్లి-హైదరాబాద్, జూన్ 5 (ఈవార్తలు): జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) నమోదు చేసిన కేసులో గత కొంతకాలంగా చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న తెలంగాణ ప్రజా ఫ్రంట్ ప్రతినిధి, సామాజిక హక్కుల నాయకుడు గాదె ఇన్నయ్యకు న్యాయస్థానంలో భారీ ఊరట లభించింది. నాంపల్లి కోర్టు ఆయనకు షరతులతో కూడిన 2 నెలల మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. కోర్టు నుంచి అధికారిక ఉత్తర్వులు వెలువడిన అనంతరం ఆయన చంచల్‌గూడ జైలు నుంచి బెయిల్‌పై విడుదలయ్యారు. ఉగ్రవాద నిరోధక చట్టం కింద ఎన్ఐఏ నమోదు చేసిన కేసులో ఇన్నయ్య నిందితుడిగా ఉన్న సంగతి తెలిసిందే. జైల్లో ఉన్న సమయంలో ఆయన వ్యక్తిగత మరియు ఆరోగ్య కారణాలను, అలాగే కుటుంబ పరిస్థితులను పురస్కరించుకుని తనకు తాత్కాలికంగా బెయిల్ మంజూరు చేయాలని నాంపల్లి కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇరుపక్షాల లాయర్ల సుదీర్ఘ వాదనలు విన్న నాంపల్లి న్యాయస్థానం.. ఇన్నయ్యకు 2 నెలల పాటు తాత్కాలికంగా మధ్యంతర బెయిల్ ఇస్తూ నిర్ణయం తీసుకుంది. బెయిల్ గడువు (2 నెలలు) ముగిసిన వెంటనే ఆయన తిరిగి కోర్టు ముందు గానీ, జైలు అధికారుల వద్ద గానీ తప్పనిసరిగా లొంగిపోవాలని న్యాయమూర్తి స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. గాదె ఇన్నయ్య జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న కాలంలోనే ఆయన తల్లిదండ్రులు ఇద్దరూ మరణించడం ఆయన కుటుంబంలో తీవ్ర విషాదాన్ని నింపింది.

# కేరళను ముంచెత్తుతున్న వర్షాలు

### తీవ్రరూపం దాల్చిన నైరుతి రుతుపవనాలు



తిరువనంతపురం: జూన్ 4న కేరళను పలకరించిన నైరుతి రుతుపవనాలు ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చాయి. రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తుండటంతో భారత వాతావరణ శాఖ (ఐఎండీ) ఈ సీజన్‌లో తొలిసారిగా రెడ్ అలర్ట్ జారీ చేసింది. కేరళ ఉత్తర భాగంలోని ఐదు జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న నివేదికల నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. శుక్రవారం ఉదయం కోజికోడ్ తదితర ప్రాంతాల్లో బలమైన ఈదురు గాలుల ధాటికి చెట్లు నేలకూలాయి. శనివారం మలప్పురం, కోజికోడ్, వయనాడ్, కన్నూర్, కాసర్‌గడ్ జిల్లాల్లో 24 గంటల వ్యవధిలో 20 సెంటీమీటర్ల కంటే ఎక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. మరికొన్ని జిల్లాలకు ఆదివారం కూడా ఈ హెచ్చరికలు వర్తిస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది. మరోవైపు ఇడుక్కి, త్రిస్సూర్, ఎర్నాకుళం, కొట్టాయం, పాలక్కాడ్, పతనంతిట్ట జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్, అలప్పుజ, కొల్లం, తిరువనంతపురం జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తూ, ఉరుములతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. సాధారణ తేదీ కంటే ఆలస్యంగా రుతుపవనాలు ప్రవేశించినప్పటికీ, వాటి తీవ్రత అధికంగా ఉండటంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. కొండచరియలు విరిగిపడే ప్రమాదం ఉన్న ప్రాంతాలు, లోతట్టు ప్రాంతాల ప్రజలు సురక్షిత ప్రాంతాలకు లేదా సహాయక శిబిరాలకు తరలివెళ్లాలని రాష్ట్ర విపత్తు నిర్వహణ సంస్థ సూచించింది. పర్యాటక ప్రాంతాలు, నదులు, కొండ ప్రాంతాలకు ప్రయాణాలు వాయిదా వేసుకోవాలని హెచ్చరించింది. అత్యవసర సహాయం కోసం 1077, 1070 హెల్ప్ లైన్ నంబర్లను సంప్రదించాలని కోరింది. శుక్రవారం మధ్యాహ్నం వరకు ఎటువంటి ప్రాణనష్టం సంభవించలేదని, అధికారులు పరిస్థితిని నిరంతరం సమీక్షిస్తున్నారని సమాచారం.



## ఒక్క చుక్కను వదలం

### ఏపీతో చర్చలు జరుగుతున్నాయి.. సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

మహబూబ్‌నగర్, జూన్ 5 (ఈవార్తలు): పాలమూరు ప్రాజెక్టు సందర్శన సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృష్ణా, గోదావరి జలాల పంపకాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చలు జరుగుతున్నాయని, త్వరలోనే తెలంగాణ ప్రజలకు శుభవార్త చెబుతామని ఆశాభావం వ్యక్తం చేశారు. అయితే, ఏపీతో చర్చలు జరిపినా రాష్ట్ర చట్టబద్ధమైన వాటాలో ఒక్క చుక్క నీటిని కూడా వదులుకునే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. తాము 'పంచాయతీ' కంటే 'పరిష్కారానికే' ప్రాధాన్యత ఇస్తామని... పాలమూరు, డిండి పెండింగ్ ప్రాజెక్టులకు క్లియరెన్స్ వస్తేనే మిగతా చర్చలు ముందుకు సాగుతాయని తేల్చి చెప్పారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో పాలమూరు జిల్లా తీవ్ర నిర్లక్ష్యానికి గురైందని సీఎం మండిపడ్డారు. గత ప్రభుత్వం కనీసం భూసేకరణ పనులను కూడా పూర్తి చేయకపోవడం వల్లే ఒక్క ఎకరాకు కూడా సాగునీరు అందించలేకపోయారని విమర్శించారు. కష్టకాలంలో కేసీఆర్‌ను ఆదుకున్న పాలమూరును అధికారంలోకి వచ్చాక ఆయన పట్టించుకోవడం మానేశారని ఆరోపించారు. వలసల జిల్లా అయిన పాలమూరును సస్యశ్యామలం చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్న సీఎం.. ఈ ప్రాజెక్టును పూర్తి చేసే బాధ్యతను తానే స్వయంగా తీసుకుంటున్నట్లు హామీ ఇచ్చారు.

## హైడ్రా రంగనాథ్‌పై చర్యలు!?

### సీఎస్‌కు కేంద్ర హోంశాఖ కార్యదర్శి లేఖ

హైదరాబాద్, జూన్ 5 (ఈవార్తలు): అంబర్‌పేట్‌లోని బతుకమ్మకుంట చెరువు భూముల ఆక్రమణ, హైడ్రా పరిరక్షణ నేపథ్యంలో కమిషనర్ రంగనాథ్‌పై కేంద్ర హోంశాఖకు ఎడ్ల సుధాకర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో రంగనాథ్ పై చర్యల అంశంపై రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి కేంద్ర హోంశాఖ కార్యదర్శి సంజీవ్ కుమార్ లేఖ రాశారు. అయితే ఈ లేఖ నేపథ్యంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పందించారు. 'బతుకమ్మకుంట ఆక్రమణదారుల కుట్రలు మరోసారి బయటపడ్డాయి. చెరువు పరిరక్షణకు కట్టుబడి ఉన్న ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారిని లక్ష్యంగా చేసుకుని, వారి ప్రతిష్టను దెబ్బతీసేందుకు ఆక్రమణదారులు సరికొత్త ఎత్తుగడలు వేస్తున్నారు. కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు వచ్చే ప్రజా ఫిర్యాదులను తదుపరి పరిశీలన కోసం రాష్ట్ర ప్రభుత్వానికి సముచిత చర్య నిమిత్తం పంపడం ఒక సాధారణ పరిపాలన ప్రక్రియ. అధికారిపై విచారణకు ఆదేశించినట్లు కాదు' అని పేర్కొన్నారు.

## బొగ్గు స్కాంపై సీబీఐ విచారణ

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి కేటీఆర్ లేఖ

హైదరాబాద్, జూన్ 5 (ఈవార్తలు): సింగరేణిలో జరిగిన రూ.1600 కోట్ల కుంభకోణంపై విచారణ జరపాలని కేంద్ర బొగ్గుగనుల శాఖమంత్రి కిషన్ రెడ్డికి కేటీఆర్ లేఖ రాశారు. సింగరేణి నిల్వల నుంచి సీఎం రేవంత్ రెడ్డి రూ.1600 కోట్ల విలువైన 40 లక్షల టన్నుల బొగ్గును మాయం చేశారని, స్టాక్ యార్డుల్లో ఉండాల్సిన బొగ్గును అప్పనంగా అమ్ముకున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక సింగరేణి వరుస కుంభకోణాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారిందని విమర్శించారు. నైని కుంభకోణం మొదలుకొని.. వందల అక్రమాలు జరిగినా ఇంతవరకూ కేంద్రం ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. బొగ్గు నిల్వల్ని తనిఖీ చేసే సంబంధిత శాఖగానీ.. కాగ్ అధికారులు కానీ ఇప్పటి వరకూ ఎందుకు తనిఖీలు చేయలేదని నిలదీశారు. సింగరేణి బొగ్గు అంటే తెలంగాణ ప్రజల ఆస్తి అని, అలాంటి ఆస్తిని దోచుకుంటుంటే చూస్తూ ఊరుకోమని స్పష్టం చేశారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి సింగరేణిని మనుగడనే దెబ్బతీస్తున్నాయని.. కిషన్ రెడ్డికి రేవంత్ రెడ్డితో మిలాఖాత్ లేకుంటే వెంటనే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. స్వయంగా కిషన్ రెడ్డే బొగ్గుగనుల శాఖ మంత్రిగా ఉండగా.. రాష్ట్రంలో ఇంత దుర్మార్గమైన కుంభకోణం జరగడం సిగ్గుచేటన్నారు. ఏప్రిల్ నెలాఖరు నాటికి మందమర్రిలో 7,20,00 మెట్రిక్ టన్నులు, శ్రీరాంపూర్ లో 8 లక్షల మెట్రిక్ టన్నులు, రామగుండం-1 లో ఆరు లక్షలు, రామగుండం-2 లో నాలుగు లక్షలు, భూపాలపల్లిలో 5 లక్షల 40 వేలు, ఇల్లందులో 3 లక్షల 50 వేలు, సత్తుపల్లిలో 2 లక్షల మెట్రిక్ టన్నులతోపాటు ఇతర వాటిని కలిపి సుమారు 40 లక్షల మెట్రిక్ టన్నుల స్టాక్ ఉందని లెక్కలు చూపించారు. కానీ కోల్ స్టాక్ పాయింట్ల దగ్గర ఆ బొగ్గు లేకపోవడమే ఈ కుంభకోణానికి అతిపెద్ద ఆధారమని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ మొత్తం వ్యవహారంలో కేంద్రం, రాష్ట్రం కలిసి లక్షల టన్నుల తెలంగాణ బొగ్గును పక్కదారి పట్టించాయా అనే బలమైన అనుమానం కార్మికలోకాన్ని వెంటాడుతోందన్నారు. ఈ స్కాంను దాచిపెట్టే కుట్రలు కొనసాగుతున్న నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఒక అఖిల పక్షాన్ని ఆయా గనుల వద్దకు పంపాలని బీఆర్ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామని కేటీఆర్ లేఖలో పేర్కొన్నారు. అసలు బొగ్గు ఉత్పత్తి కోసం కోల్ ఇండియా పాటించే విధానాలేంటి? కాంగ్రెస్ హయాంలో సైట్ విజిట్ సర్టిఫికేట్ ను ఎవరి ప్రయోజనాలు ఆశించి పెట్టారు? చివరికి కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులను ఎలా పక్కదారి పట్టించారు ? అనే అంశాలపై వాస్తవాలను బయటపెట్టకపోవడం కాంగ్రెస్ ముఖ్యమంత్రితో మీకున్న లోపాయికారి ఒప్పందాలను బట్టబయలు చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. అన్ని టన్నుల బొగ్గు ఏమయిందో వెంటనే విచారణ జరిపించి నిజానిజాలేంటో తేల్చి.. బీజేపీ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని లేఖ ద్వారా డిమాండ్ చేశారు. ఈ కుంభకోణంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని కోరారు. సింగరేణి సంస్థను కోలుకోని విధంగా దెబ్బతీసే ఈ కుంభకోణంపై ఒకవేళ విచారణ జరపకపోతే కార్మికలోకంతో కలిసి కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలపై బీఆర్ఎస్ పార్టీ జంగ్ సైరన్ మోగిస్తుందని హెచ్చరించారు.

## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.

## డాక్టర్ల సమ్మె విరమణ

హైదరాబాద్, జూన్ 5 (ఈవార్తలు): వైద్య ఆరోగ్య శాఖలో గత కొద్ది రోజులుగా తీవ్ర గందరగోళానికి దారి తీసిన ఉద్యోగుల బదిలీల వ్యవహారంలో ఎట్టకేలకు కీలక ముందడుగు పడింది. ప్రభుత్వ మార్గదర్శకాలకు విరుద్ధంగా అధికారులు వ్యవహరిస్తున్నారంటూ ప్రభుత్వ వైద్యుల సంఘం (టీజీజీడీఏ) ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన ఓపీ సేవల బంద్.. వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి జోక్యంతో తెరపడింది. మరోవైపు ఈ బదిలీల ప్రక్రియలో రాష్ట్ర వ్యాప్తంగా అమలు కావాల్సిన జీవో నెంబర్ 38ని, వైద్య ఆరోగ్య శాఖ ప్రత్యేకంగా తెచ్చుకున్న జీవో నెంబర్ 28 పేరిట పూర్తిగా భ్రష్టు పట్టించారని వైద్యులు, పారామెడికల్ సిబ్బంది తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మూడేళ్ల సర్వీసు దాటిన వారికి బదిలీల్లో అసలు ఆప్షన్లు ఇచ్చుకునేందుకే అవకాశం కల్పించలేదని, అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల్సిన స్పౌజ్ (భార్యాభర్తల), మెడికల్ గ్రౌండ్స్ కేసులను కూడా అధికారులు పూర్తిగా ఖాతరు చేయడం లేదని వైద్యులు, సిబ్బంది వాపోయారు. బదిలీల అక్రమాలపై శుక్రవారం సాయంత్రం తెలంగాణ గవర్నమెంట్ డాక్టర్స్ అసోసియేషన్ (టీజీజీడీఏ) కార్యవర్గం వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి క్షేత్రస్థాయి పరిస్థితులను వివరించింది. జీవో 38ని యథాతథంగా అమలు చేయనందుకే తాము ఓపీ సేవలను బంద్ చేయాల్సి వచ్చిందని మంత్రికి ఫిర్యాదు చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మంత్రి.. జీవో 38 ప్రకారమే బదిలీల ప్రక్రియ పారదర్శకంగా చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఒక రోజు అదనపు పొడిగింపుతో బదిలీల వెబ్ ఆప్షన్ల గడువు శుక్రవారం సాయంత్రం తోనే ముగిసిపోయింది. అయితే అధికారుల తీరు వల్ల ఆప్షన్లు నమోదు చేసుకోలేకపోయిన స్పౌజ్ కేసులు, మెడికల్ గ్రౌండ్స్ అభ్యర్థులు, మూడేళ్ల సర్వీస్ పూర్తయిన వారికి శనివారం ప్రత్యేకంగా ఆప్షన్లు ఇచ్చుకునేందుకు అవకాశం కల్పించాలని మంత్రి ఆదేశాలు జారీ చేశారు. మంత్రి నుంచి స్పష్టమైన హామీ రావడంతో ప్రభుత్వ వైద్యుల సంఘం తమ సమ్మెను (ఓపీ సేవల బంద్) ఉపసంహరించుకుంది. శనివారం నుంచి యథావిధిగా విధుల్లో పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందిస్తామని ప్రకటించింది.



## మలేషియాకు కేటీఆర్

కౌలాలంపూర్: బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కుటుంబ సమేతంగా మలేషియా రాజధాని కౌలాలంపూర్ చేరుకున్నారు. మలేషియా తెలంగాణ అసోసియేషన్ (మైటా), బీఆర్ఎస్ మలేషియా శాఖల సంయుక్త ఆధ్వర్యంలో శనివారం కౌలాలంపూర్‌లో నిర్వహించనున్న తెలంగాణ ఆవిర్భావ వేడుకల్లో కేటీఆర్ ముఖ్య అతిథిగా పాల్గొననున్నారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమంలో పాల్గొనేందుకు కేటీఆర్ తన కుటుంబ సభ్యులతో కలిసి అక్కడికి వెళ్లారు. కౌలాలంపూర్ విమానాశ్రయానికి చేరుకున్న కేటీఆర్ దంపతులకు, కుటుంబ సభ్యులకు ప్రవాస తెలంగాణ ప్రతినిధులు, బీఆర్ఎస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. స్వాగతం పలికిన వారిలో తుంగతుర్తి మాజీ శాసనసభ్యులు గాదరి కిశోర్‌కుమార్, మైటా అధ్యక్షుడు తిరుపతి, బీఆర్ఎస్ మలేషియా అధ్యక్షుడు మారుతితోపాటు ఇతర ముఖ్య నేతలు, ఎన్నారైలు ఉన్నారు.



## గంగాధరలో ఎమ్మెల్యే సత్యం జన్మదిన వేడుకలు

గంగాధర, జూన్ 5 (ఈవార్తలు): చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం జన్మదిన వేడుకలను గంగాధర మండలంలోని మధురానగర్‌లో కాంగ్రెస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మంత్రి మహేందర్ ఆధ్వర్యంలో రామాలయంలో ఎమ్మెల్యే పేరిట ప్రత్యేక పూజలు నిర్వహించి, అంబేద్కర్ చౌరస్తాలో కేక్ కట్ చేశారు. అనంతరం నిరుపేదలకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మహేందర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం నియోజకవర్గ అభివృద్ధి కోసం నిరంతరం కృషి చేస్తున్నారని అన్నారు. విద్యా రంగ అభివృద్ధికి డిగ్రీ కళాశాల, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల మంజూరు చేయించడంతో పాటు రైతుల సంక్షేమానికి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యేకు ఆయురారోగ్యాలు, ఉన్నత పదవులు కలగాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ముద్దం నగేష్, దుబ్బాసి బుచ్చయ్య, వేముల భాస్కర్, రామిడి రాజిరెడ్డి, సత్తు కనకయ్యతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## శ్రీవారి సేవలో అడువాల జ్యోతి

జగిత్యాల, జూన్ 5 (ఈవార్తలు): జగిత్యాల మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి లక్ష్మణ్ తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి సన్నిధిలో గురువారం ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. తెల్లవారుజామున నిర్వహించిన సుప్రభాత సేవలో భక్తిశ్రద్ధలతో పాల్గొని అనంతరం స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, జగిత్యాల జిల్లా అభివృద్ధి, రైతుల సంక్షేమం, యువతకు ఉపాధి అవకాశాలు కలగాలని శ్రీవారిని ప్రార్థించినట్లు తెలిపారు. ఆలయ వేద పండితులు ఆమెకు వేద ఆశీర్వచనాలు అందించగా, తీర్థప్రసాదాలు స్వీకరించారు. అడువాల జ్యోతి లక్ష్మణ్ మాట్లాడుతూ తిరుమల శ్రీవారి దర్శనం ఆధ్యాత్మిక ఆనందాన్ని కలిగించిందని చెప్పారు. శ్రీవారి కృపతో ప్రజలందరూ ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు, సుఖసంతోషాలతో జీవించాలని ఆకాంక్షించారు. ఈ దర్శన కార్యక్రమంలో కుటుంబ సభ్యులు, సన్నిహితులు పాల్గొన్నారు.




## సర్కారు బడికే పంపండి!

**బడిబాటలో సర్కారు సార్ల వినతులు**

ధర్మపురి, జూన్ 5 (ఈవార్తలు): ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా కమలాపూర్ గ్రామంలో పాఠశాల బృందం ఉపాధి హామీ కూలీలను, తల్లిదండ్రులను కలిసి ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, సౌకర్యాలపై అవగాహన కల్పించింది. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ కుమ్మరి తిరుపతి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధన, ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, అల్పాహారం, పౌష్టికాహార భోజనం, విశాలమైన తరగతి గదులు, క్రీడా, గ్రంథాలయ సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. గ్రామంలోని ప్రతి విద్యార్థిని ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పించాలని కోరారు. ప్రధానోపాధ్యాయులు ఎదుల మహేశ్ మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు ఖర్చు చేయకుండా, ప్రభుత్వ పాఠశాలల్లోనే కార్పొరేట్ స్థాయి సౌకర్యాలు ఉచితంగా లభిస్తున్నాయని వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ కార్యదర్శి దీపిక, ఉపాధి హామీ కూలీలు తదితరులు పాల్గొన్నారు.




## కరాటేలో జగిత్యాల విద్యార్థులకు బ్లాక్ బెల్ట్

కరీంనగర్/జగిత్యాల, జూన్ 5 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాకు చెందిన నలుగురు విద్యార్థులు కరాటేలో ప్రతిభ కనబర్చి బ్లాక్‌బెల్ట్ సాధించారు. కరీంనగర్‌లోని వివేకానంద రెసిడెన్షియల్ స్కూల్‌లో ఒకినావా మార్షల్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన బెల్ట్ గ్రేడింగ్ టెస్ట్‌లో ఎస్. చక్రి, కె. సాయి చరణ్, బి. సౌమిత్ రాజ్, కె. చైతన్య బ్లాక్‌బెల్ట్‌ను కైవసం చేసుకున్నారు. తెలంగాణ డిప్యూటీ గ్రాండ్ మాస్టర్, చీఫ్ ఎగ్జామినర్ కె. వసంత్‌కుమార్ పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు బెల్ట్‌లు, సర్టిఫికెట్లు అందజేశారు. విద్యార్థులను కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌస్ అలం అభినందించారు. యువత వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై దృష్టి పెట్టాలని, బాలికలు ఆత్మరక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ కరాటే మాస్టర్ మర్రిపల్లి లింగయ్య, ఎంఏ మన్నన్, అనంతుల కాంతారావు తదితరులు పాల్గొన్నారు.

# ఇంకెన్ని చావులు చూస్తారు?

**వైద్య కార్మికులపై కనికరమేది?.. ప్రభుత్వం కండ్లు తెరిచేదెప్పుడు?.. ఎస్పీఎస్ కార్మికుల ఆక్రందన**

**ప్రభుత్వంపై పోరాటానికి సన్నద్ధం**

**పెద్దపల్లిలో నూతన కార్యవర్గం ఏర్పాటు**



పెద్దపల్లి, జూన్ 5 (ఈవార్తలు): 'ఎముకలు కుళ్ళిపోయే రోగాల నడుమ, ప్రాణాలు తీసే వైరస్‌ల మధ్య నిత్యం బతుకుపోరాటం చేస్తున్న కార్మికులను కాంట్రాక్ట్ పేరిట దోచుకోవడం ఆపాలి. కనీస వేతనం రూ.26,000 పెంచి, రూ.10 లక్షల బీమా కల్పించి, కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేయాలి, ఆసుపత్రి లోపలికి అడుగుపెట్టడానికే సామాన్యుడు భయపడే చోట... రోగుల మలమూత్రాలను శుభ్రం చేస్తూ, వారి ప్రాణాలను కాపాడటంలో కంటికి రెప్పలా కాపలా కాస్తూ, సమాజ ఆరోగ్యం కోసం మా ఆరోగ్యాన్ని బలిపెడుతున్న పేషెంట్ కేర్, శానిటేషన్, సెక్యూరిటీ గార్డుల జీవితాలు రోడ్డున పడ్డా ప్రభుత్వాలు కనికరించడం లేదు. ప్రభుత్వాలను మేము అడుగుతున్నది విలాసాలు కాదు... మా శ్రమకు తగ్గ న్యాయం. మా పిల్లల ఆకలి తీర్చే కనీస వేతనం. నిత్యావసర ధరలు ఆకాశాన్ని తాకుతున్న ఈరోజుల్లో, నెలకు ఇచ్చే అరకొర జీతాలతో ఇల్లు గడవడం ఎలా? రోగుల ప్రాణాలు కాపాడే మాకు... మా పిల్లల చదువులకు, తిండికి పైసలు సరిపోక అర్ధాకలితో అలమటించాలా? మా ప్రాణాలకు విలువ లేదా? విధి నిర్వహణలో ఎంతోమంది సిబ్బంది రోగాల బారిన పడి, ప్రమాదాలకు గురై చనిపోతున్నారు. మా ప్రాణం పోతే మా కుటుంబాలు రోడ్డున పడాలా? మాకు 10 లక్షల ప్రమాద బీమా గ్యారెంటీ ఇవ్వడానికి ప్రభుత్వానికి చేతులు రావడం లేదా? ఈ కాంట్రాక్ట్ బానిసత్వం ఇంకెన్నాళ్లు? మధ్యలో ఉన్న కాంట్రాక్టర్లు మా రక్తాన్ని పిండి, మా జీతాల్లో కమీషన్లు నొక్కుతూ మమ్మల్ని బానిసల్లా వాడుకుంటున్నారు. ఈ దోపిడీ వ్యవస్థను తక్షణమే రద్దు చేసి, ప్రభుత్వమే మమ్మల్ని నేరుగా ఎందుకు చేరదీయదు?' అని వైద్య కార్మికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇంకెంత మంది కార్మికులు ఆసుపత్రి శవాల గదుల ముందే శవాలుగా మారాలని నిట్టూరుస్తున్నారు. తమ హక్కుల కోసం ఇంకెంత మంది కార్మికులు బలిదానాలు చేస్తే ఈ ప్రభుత్వాల గుండె కరుగుతుందని నిలదీస్తున్నారు. ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించకపోతే వ్యవస్థలను స్తంభింపజేస్తామని హెచ్చరిస్తున్నారు. అందులో భాగంగా ప్రభుత్వంపై పోరాటానికి సన్నద్ధం అవుతున్నారు. జిల్లాల వారీగా కమిటీలను తయారు చేస్తూ ప్రభుత్వంపై బలప్రదర్శనకు సిద్ధమయ్యారు. శుక్రవారం పెద్దపల్లి ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి (జీజీహెచ్)లో శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సూపర్వైజర్ మెడికల్ అండ్ హెల్త్ వర్కర్స్ అసోసియేషన్ (ఎస్పీఎస్) ఆధ్వర్యంలో నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆస్పత్రిలో అశోక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశానికి ఎస్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుర్రి సైదయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్న బోస్క నరేష్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో పనిచేస్తున్న పేషెంట్ కేర్, శానిటేషన్, సెక్యూరిటీ కార్మికులు అనేక ప్రమాదకర పరిస్థితుల్లో విధులు నిర్వహిస్తున్నప్పటికీ తగిన వేతనాలు, భద్రతా సౌకర్యాలు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కార్మికులకు కనీస వేతనంగా నెలకు రూ.26 వేల జీతం చెల్లించడంతో పాటు రూ.10 లక్షల ప్రమాద బీమా కల్పించాలని డిమాండ్ చేశారు. కాంట్రాక్ట్ వ్యవస్థ కారణంగా కార్మికులు తీవ్ర దోపిడీకి గురవుతున్నారని, మధ్యవర్తుల వ్యవస్థను రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా నియామకాలు చేపట్టాలని కోరారు. కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఎస్పీఎస్ యూనియన్ ఆధ్వర్యంలో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్మికుల హక్కుల సాధన కోసం పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. అనంతరం పెద్దపల్లి జీజీహెచ్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కమిటీ అధ్యక్షుడిగా పొన్నం రాజు, ప్రధాన కార్యదర్శిగా రాకేష్, కోశాధికారిగా శివను ఎన్నుకోగా, మొత్తం 19 మంది సభ్యులకు వివిధ బాధ్యతలు అప్పగించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వైనాల రవి, మాతంగి అనిల్ కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శి గొర్రె నాగరాజు, రాష్ట్ర కార్యదర్శి పి. అంజలి, సంతోష్, జనగామ జిల్లా అధ్యక్షుడు ఏనుగుల రఘు, జిల్లా ప్రధాన కార్యదర్శి గండి అజయ్ కుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు స్వామి తదితరులతో పాటు ఆస్పత్రిలో పనిచేస్తున్న శానిటేషన్, పేషెంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

# అందరం కలిసి ధర్మపురిని అభివృద్ధి చేద్దాం

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పిలుపు.. పుష్కరాల కోసం రూ.117 కోట్లు కేటాయింపు**



ధర్మపురి, జూన్ 5 (ఈవార్తలు): ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి క్షేత్ర అభివృద్ధి పనులను భూనిర్వాసితుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుంటూ ముందుకు తీసుకెళ్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ధర్మపురిలో జిల్లా కలెక్టర్, అధికారులు, భూనిర్వాసితులతో కలిసి క్షేత్రాభివృద్ధి, గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు. మంత్రి మాట్లాడుతూ భూనిర్వాసితులను ఇబ్బందులకు గురిచేయకుండా అభివృద్ధి పనులు చేపడతామని, 2017-18 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. ఇప్పటికే పలుమార్లు చర్చలు జరిపామని, శనివారం మరోసారి భూనిర్వాసితులతో సమావేశమవుతామని తెలిపారు. ధర్మపురి క్షేత్ర అభివృద్ధికి స్థానికులంతా సహకరించాలని కోరిన మంత్రి, అభివృద్ధి విషయంలో రాజకీయాలకు తావివ్వొద్దన్నారు. దేశం నలుమూలల నుంచి వచ్చే భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు.

**పుష్కరాలకు రూ.117 కోట్లు**

2027లో జరిగే గోదావరి పుష్కరాల కోసం ధర్మపురి, కోటిలింగాల ప్రాంతాల అభివృద్ధికి తొలి విడతగా రూ.117 కోట్లు కేటాయించినట్లు మంత్రి తెలిపారు. బైపాస్ రహదారులు, పార్కింగ్ స్థలాలు, పుష్కర ఘాట్ల నిర్మాణంతో పాటు మరిన్ని సౌకర్యాల కోసం ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించినట్లు చెప్పారు. పుష్కరాలకు ముందే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. సమీక్ష సమావేశంలో జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్, మున్సిపల్ చైర్‌పర్సన్ వేముల నాగలక్ష్మి, దేవాదాయ శాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## రైతుల సమస్యలపై ప్రభుత్వం విఫలం

**మాజీ మంత్రి జీవన్‌రెడ్డి విమర్శలు**

సారంగాపూర్, జూన్ 5 (ఈవార్తలు): రైతాంగంలో ప్రభుత్వం పట్ల తీవ్ర అసంతృప్తి నెలకొన్నదని మాజీ మంత్రి, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్‌రెడ్డి అన్నారు. శుక్రవారం సారంగాపూర్ మండల కేంద్రంలో నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు భరోసా సహా ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలుకు నోచుకోలేదని విమర్శించారు. ధాన్యం సేకరణలో అనేక సమస్యలు నెలకొన్నాయని, కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యం తరలించడమే లక్ష్యంగా మారిందని ఆరోపించారు. ఏ గ్రేడ్ ధాన్యాన్ని బీ గ్రేడ్‌గా పరిగణిస్తున్నారని, మిల్లర్లు, అధికారుల కుమ్మక్కు ఉందని వ్యాఖ్యానించారు. పెన్షన్ల అంశంపై కూడా ప్రభుత్వం విఫలమైందని జీవన్‌రెడ్డి అన్నారు. వృద్ధులు, వితంతువులు, ఒంటరి మహిళలు, బీడీ కార్మికులు ఆశించిన విధంగా కొత్త పెన్షన్లు మంజూరు కాలేదని తెలిపారు. ఆసరా పెన్షన్‌ను రూ.4 వేలకు పెంచుతామని చెప్పినా అమలు జరగలేదన్నారు. 30 నెలల పాలనలో కొత్త పెన్షన్ ఒక్కరికీ కూడా ఇవ్వలేదని విమర్శించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకంలో అర్హులను ఎంపిక చేసినప్పటికీ నిధులు విడుదల కాలేదని చెప్పారు. ఆటో కార్మికులకు నెలకు రూ.1,000 ఇస్తామని హామీ ఇచ్చినా ఇప్పటివరకు అమలు కాలేదన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారం మోపుతున్నాయని ఆరోపించారు. ఎన్నికల హామీల ప్రకారం కనీసం రూ.2,000 పెన్షన్ అయినా అన్ని వర్గాలకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో యువజన నాయకుడు తాటిపర్తి సి.కె. రెడ్డి, బూసి మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ఎండపల్లి, జూన్ 5 (ఈవార్తలు): ఎండపల్లి మండలం చర్లపల్లి గ్రామానికి చెందిన పత్తిపాక మీసా మునిలత (34) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, మునిలత అవసరాల నిమిత్తం రాజారంపల్లి గ్రామానికి వెళ్లి వివేకానంద చౌరస్తా వద్ద రోడ్డు దాటుతుండగా ప్రమాదం జరిగింది. అదే సమయంలో జగిత్యాల నుంచి బసంత్‌నగర్ వైపు వెళ్తున్న లారీ (నెం. ఏపీ-21-టీవై-6772) ఆమెను ఢీకొట్టినట్లు తెలిపారు. లారీని మదాసు కొమురయ్య (పాలకుర్తి గ్రామం) అజాగ్రత్తగా, అతివేగంగా నడపడంతో ప్రమాదం జరిగినట్లు పేర్కొన్నారు. తీవ్రంగా గాయపడిన మునిలతను స్థానికులు వెంటనే జగిత్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, వైద్యులు పరీక్షించి ఆమె అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. మృతురాలి తల్లి పత్తిపాక లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. మృతదేహానికి పోస్ట్‌మార్టం నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు.

## నా సభకు రావయ్యా పవన్: కేఏ పాల్

హ్యూస్టన్: జనసేన అధినేత పవన్ కల్యాణ్ ఇటీవల తెలంగాణలో చేసిన వ్యాఖ్యలు సంచలనం రేకెత్తించిన సంగతి తెలిసిందే. పవన్ వ్యాఖ్యలపై ప్రజాశాంతి పార్టీ అధినేత కేఏ పాల్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. "పవన్ కల్యాణ్ ఇలా ప్రాంతాల మధ్య చిచ్చు పెట్టడం న్యాయమేనా?" అని పాల్ ప్రశ్నించారు. ప్రజలు తమకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చాలని నిలదీస్తుంటే.. వాటిని పక్కనపెట్టి, ఈ గొడవలు ఎందుకంటూ మండిపడ్డారు. అలాగే జూన్ 14న అమెరికాలోని హ్యూస్టన్‌లో తాను నిర్వహించబోయే భారీ సభకు రావాలంటూ పవన్‌ను ఆహ్వానించారు. ఇటీవలి ప్రెస్ మీట్‌లో పవన్ కల్యాణ్ మాట్లాడుతూ.. జనసేన తెలంగాణలోనూ పోటీ చేస్తుందని, త్వరలోనే తాను ఇక్కడ పర్యటిస్తానని స్పష్టం చేశారు.

# ప్రకృతి రక్షణ మన బాధ్యత: ఎస్పీ



జగిత్యాల, జూన్ 5 (ఈవార్తలు): పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ప్రకృతిని కాపాడుకోవడం ద్వారా భావితరాలకు ఆరోగ్యకరమైన భవిష్యత్తును అందించగలమని జిల్లా ఎస్పీ అశోక్‌కుమార్ ఐపీఎస్ పేర్కొన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం జగిత్యాల జిల్లా పోలీస్ కార్యాలయ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో అధికారులు, పోలీసు సిబ్బందితో కలిసి ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో చెట్ల పాత్ర ఎంతో కీలకమని అన్నారు. పెరుగుతున్న కాలుష్యం, వాతావరణ మార్పులు, భూగర్భ జలాల క్షీణత వంటి సమస్యలకు చెట్ల పెంపకం ప్రధాన పరిష్కార మార్గమని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని పెద్ద చెట్లుగా తీర్చిదిద్దడం కూడా అంతే ముఖ్యమని తెలిపారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా చేపట్టే కార్యక్రమాలు సమాజంలో పచ్చదనాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని ఎస్పీ అన్నారు. పోలీసు శాఖ కూడా పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ వివిధ సందర్భాల్లో మొక్కల నాటే కార్యక్రమాలు చేపడుతోందన్నారు. పచ్చని పర్యావరణం, స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన జీవన విధానం కోసం ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటి దానిని సంరక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చేతన్ నితిన్ ఐపీఎస్, డీఎస్పీలు పురుషోత్తం రెడ్డి, రాములు, ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి: దావ వసంత

జగిత్యాల, జూన్ 5 (ఈవార్తలు): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ తన నివాసంలో మొక్కను నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా చెట్లు నాటి వాటిని సంరక్షించాలని పిలుపునిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన హరితహారం కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో పచ్చదనం గణనీయంగా పెరిగిందన్నారు. ప్రతి గ్రామంలో నర్సరీలు ఏర్పాటు చేసి, ఇంటింటికీ పూలు, పండ్ల మొక్కలు పంపిణీ చేయడంతో పాటు పల్లె ప్రకృతి వనాల పేరుతో పార్కులు అభివృద్ధి చేశారని గుర్తుచేశారు. తెలంగాణను పచ్చదనంతో నింపిన హరిత విప్లవకారుడు కేసీఆర్ అని కొనియాడారు. ప్రస్తుతం హరితహారం పేరును మార్చినప్పటికీ చెట్ల పెంపకానికి తగిన ప్రాధాన్యం కనిపించడం లేదని విమర్శించారు. కాలుష్యం, పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు చెట్ల కొరతే ప్రధాన కారణమని పేర్కొంటూ, అందరూ మొక్కలు నాటి వాటిని రక్షించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుర్ర ప్రవీణ్ గౌడ్, మంజుల తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత: కలెక్టర్

జగిత్యాల, జూన్ 5 (ఈవార్తలు): ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని జగిత్యాల పట్టణంలోని గన్ పార్క్‌లో జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని, భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, హరిత వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని సూచించారు. పర్యావరణ సమతుల్యతను కాపాడడంలో చెట్ల పాత్ర కీలకమని పేర్కొన్నారు. మొక్కల పెంపకం ద్వారా కాలుష్యాన్ని తగ్గించడంతో పాటు జీవ వైవిధ్యాన్ని పరిరక్షించవచ్చని తెలిపారు. జిల్లాలో హరితహారం కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (లోకల్ బాడీస్) బి. రాజ గౌడ్, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, మున్సిపల్ కమిషనర్ సత్య ప్రణవ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.



## లవ్లీ చిత్రం






## పోలీస్ అధికారిగా సాయి పల్లవి!

టాలీవుడ్, కోలీవుడ్ ప్రేక్షకుల అభిమాన హీరోయిన్ సాయి పల్లవి ప్రస్తుతం కెరీర్ పరంగా ఫుల్ జోష్‌లో ఉన్నారు. గత ఏడాది 'తండేల్' సినిమాతో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న సాయి పల్లవి ఇప్పుడు క్రేజీ ప్రాజెక్ట్స్'ను లైన్‌లో పెడుతున్నారు. బాలీవుడ్‌లో ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతున్న 'రామాయణ'లో సీత పాత్రలో నటిస్తోంది ఈ ముద్దుగుమ్మ. అంతేకాకుండా కోలీవుడ్ స్టార్ హీరో ధనుష్ కెరీర్‌లో 'డీ-55'గా రాబోతున్న చిత్రంలోనూ కీలక పాత్రలో నటించనుంది. ఈ మూవీకి 'అమరన్' తో బ్లాక్ బస్టర్ హిట్ అందుకున్న డైరెక్టర్ రాజ్ కుమార్ పెరియసామి దర్శకత్వం వహిస్తున్నారు. సాయి పల్లవికి ఈ దర్శకుడితో ఇది రెండో సినిమా కావడం విశేషం. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కుతున్న ఈ సినిమాలో సాయి పల్లవితో పాటు టాలెంటెడ్ బ్యూటీ శ్రీలీ, వర్సటైల్ యాక్టర్ ఎస్ జే కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను ధనుష్‌కు చెందిన వండర్ బార్ ఫిల్మ్స్, ఆర్ టేక్ స్టూడియోస్ సంస్థలు సంయుక్తంగా అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నాయి. ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన పూజా కార్యక్రమాలు గ్రాండ్‌గా పూర్తి కాగా, షూటింగ్ కూడా శరవేగంగా ప్రారంభమైంది. ఈక్రమంలో.. తాజాగా, ఈ సినిమాకు సంబంధించి ఒక ఆసక్తికరమైన వార్త తెగ వైరల్ అవుతోంది. ఈ పీరియాడికల్ యాక్షన్ డ్రామాలో సాయి పల్లవి మొట్టమొదటి సారి ఒక పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్ పాత్రలో నటించబోతున్నట్లు సమాచారం. ఇప్పటివరకు హోమ్లీ, ఎమోషనల్ పాత్రల్లో మెప్పించిన సాయి పల్లవి, తొలిసారి ఖాకీ దుస్తులు ధరించి యాక్షన్ సీన్స్‌లో కనిపించనుండటంతో అభిమానుల్లో ఒక్కసారిగా హైప్ క్రియేట్ అయింది.

## 30 నిమిషాలు గూస్ బంప్స్!

### 'వారణాసి'పై విజయేంద్రప్రసాద్ వ్యాఖ్య

సూపర్ స్టార్ మహేష్ బాబు హీరోగా చేస్తున్న లేటెస్ట్ మూవీ వారణాసి. రాజమౌళి దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమా పాన్ ఇండియా రేంజ్ లో రిలీజ్ కానుంది. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ చాలా వేగంగా జరుగుతుండగా.. వచ్చే ఏడాది సమ్మర్ కానుకగా రిలీజ్ అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇలాంటి నేపథ్యంలో వారణాసి సినిమాపై రాజమౌళి తండ్రి విజయేంద్ర ప్రసాద్ బిగ్ అప్డేట్ ఇచ్చారు. ఈ సినిమా స్టోరీలో ఎక్కువ భాగం రాముడు వర్సెస్ కుంభకర్ణుడి మధ్య ఉంటుందని ఓ ఇంటర్వ్యూలో



వివరించారు. వారి మధ్య జరిగే 30 నిమిషాల యుద్ధం సినిమాకు మేజర్ హైలైట్ గా నిలుస్తుందని పేర్కొన్నారు. మహేష్ బాబును షూటింగ్ లో తొలిసారి రాముడి గెటప్ లో చూసి తనకు గూస్ బంప్స్ వచ్చాయని కూడా తెలిపారు. దీంతో విజయేంద్ర ప్రసాద్ చేసిన వ్యాఖ్యలు వైరల్ గా మారాయి. కాగా మహేష్ బాబు హీరోగా చేస్తున్న వారణాసి సినిమాలో ప్రియాంక చోప్రా హీరోయిన్‌గా, మలయాళీ స్టార్ హీరో పృథ్వీరాజ్ సుకుమారన్ నటిస్తున్నారు. ఇప్పటికే అతడి పోస్టర్ కూడా చిత్ర బృందం వదిలింది. దాదాపు రూ.1400 కోట్ల బడ్జెట్ తో ఈ సినిమాను రాజమౌళి చాలా గ్రాండ్ గా తీస్తున్నారు. అంటార్కిటికా ఖండంలోని గడ్డకట్టే మంచు కొండల్లో షూటింగ్ జరుపుకున్న మొదటి సినిమాగా వారణాసి రికార్డు కూడా సృష్టించింది. ఇటు రామోజీ ఫిలిం సిటీలో కూడా కొన్ని సన్నివేశాలు చిత్రీకరిస్తున్నారు.


## నిర్మాతగా నాగచైతన్య

వరుస పరాజయాలతో సతమతమవుతున్న టైమ్‌లో 'దూత' వెబ్ సిరీస్‌తో ఓటీటీ ఎంట్రీ ఇచ్చి సాలిడ్ హిట్ అందుకున్నాడు అక్కినేని హీరో నాగచైతన్య. 2023 డిసెంబర్ 1న అమెజాన్ ప్రైమ్ వీడియోస్‌లో విడుదలై పలు రికార్డులు సొంతం చేసుకున్న ఈ సిరీస్‌కు ఇప్పుడు సీక్వెల్‌గా 'దూత 2' రాబోతున్నది. తాజాగా దీనికి సంబంధించిన పూజాకార్యక్రమాలు గ్రాండ్‌గా జరగగా.. అక్కినేని నాగార్జున క్లాప్ కొట్టి దీన్ని ప్రారంభించారు. ఇందులో మరో విశేషం ఏంటంటే.. ఈ దూత 2తో నాగచైతన్య నిర్మాతగా మారుతున్నట్లు ప్రకటించాడు. ఈ మేరకు పూజాకార్యక్రమాలకు సంబంధించిన ఫొటోలను తన సోషల్ మీడియా అకౌంట్ ఎక్స్ వేదికగా పంచుకుంటూ.. "దూత' రెండవ అధ్యాయంలోకి అడుగుపెడుతూ, నిర్మాతగా నా ప్రయాణాన్ని ప్రారంభిస్తున్న ఈ శుభ తరుణంలో.. ఇకపై అంతా ఉన్నతమైన పురోగతే.. ముందున్న అద్భుతమైన ప్రయాణానికి స్వాగతం' అంటూ చెప్పుకొచ్చాడు. కాగా.. విక్రమ్ కె. కుమార్ దర్శకత్వంలో రూపొందిన హారర్ మిస్టరీ థ్రిల్లర్ 'దూత'లో నాగచైతన్య జర్నలిస్ట్ సాగర్ వర్మ అవధూరిగా అందరిని ఆకట్టుకున్నాడు. దీంతో సాగర్ వర్మ మళ్లీ వచ్చేస్తున్నాడు అంటూ అనౌన్స్‌మెంట్ ఇచ్చిన ఫొటోస్ ప్రస్తుతం వైరల్ అవుతూ అందరిని దృష్టిని ఆకర్షిస్తున్నాయి.



## టాలెంట్‌ను నమ్ముకున్నా

'నేను ఎప్పుడూ పొగడ్తలను తలకెక్కించుకోను, అలాగే విమర్శలను అస్సలు పట్టించుకోను. ఇండస్ట్రీలో ఒక సక్సెస్‌ఫుల్ నటిగా గుర్తింపు తెచ్చుకోవాలని అందరికీ ఉంటుంది, దానికి నేనేమీ మినహాయింపు కాదు. కానీ, ఇండస్ట్రీలో ఎప్పుడు ఏం జరుగుతుందో ఎవరూ ఊహించలేరు. ఒక సినిమా సక్సెస్ అనేది చాలా విషయాలపై ఆధారపడి ఉంటుంది. నేను నటించిన చిత్రాలు కొన్ని హిట్టయ్యాయి, అందుకు నేను చాలా సంతోషంగా ఉన్నాను. ఒకవేళ సినిమా ఆడకపోతే దానికి గల కారణాలను తెలుసుకుని, నన్ను నేను సరిదిద్దుకోవడానికి ప్రయత్నిస్తాను' అంటోంది నిధి అగర్వాల్. తనను అదృష్టం లేని నటిగా విమర్శిస్తున్న వారికి సమాధానమిస్తూ.. తాను అదృష్టం కంటే కేవలం తన టాలెంట్‌ను మాత్రమే నమ్ముకుంటానని నిధి స్పష్టం చేసింది. సినిమా ఫలితాలతో సంబంధం లేకుండా నటిగా తన వంద శాతం శ్రమను ఎప్పుడూ పెడుతూనే ఉంటానని తెలిపింది. నిధి చేసిన ఈ కామెంట్స్ ఇండస్ట్రీలో హాట్ టాపిక్‌గా మారాయి. ఎన్ని పరాజయాలు ఎదురైనా కుంగిపోకుండా, తన టాలెంట్‌పై నమ్మకంతో ఉన్న నిధిని అభిమానులు అభినందిస్తున్నారు.




## జన నాయగన్‌పై విజయ్ కీలక నిర్ణయం



తమిళనాడు సీఎం విజయ్ దళపతి నటించిన చిత్రం 'జననాయగన్'. విజయ్ రాజకీయాల్లోకి ఎంట్రీ ఇవ్వకముందు అనౌన్స్ చేసిన ఈ చిత్రం.. ఇప్పుడు ఆయన సీఎం అయిన తర్వాత కూడా రిలీజ్‌కు మాత్రం రావడం లేదు. ఈ మూవీ రిలీజ్ విషయంలో ఎప్పటికప్పుడు అవంతరాలు ఏర్పడుతూనే ఉన్నాయి. మొదట 2026 సంక్రాంతి కానుకగా తీసుకొద్దాం అని ప్లాన్ చేశారు. కానీ సెన్సార్ కొన్ని అభ్యంతరాలు చెప్పడంతో వాయిదా పడింది. ఇక విజయ్ రీసెంట్‌గా సీఎం అయినా కూడా ఈ సినిమా రిలీజ్ ఓ కొలిక్కి రావడం లేదు. ఇక ఇటీవల జూన్ 19న రిలీజ్ చేయబోతున్నట్లు ప్రకటించారు. ఇప్పుడు అది కూడా సస్పెన్స్‌గా మారింది. అయితే.. 'జననాయగన్' కు సంబంధించిన తమిళనాడు హక్కులను కేవీఎన్ ప్రొడక్షన్స్ విడిగా విక్రయించింది.

## ఆన్‌లైన్‌లో పెద్ది హెచ్‌డీ ప్రింట్


గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా భారీ అంచనాలతో థియేటర్లలోకి వచ్చిన 'పెద్ది' మూవీ మిక్స్‌డ్ టాక్‌తో వసూళ్ల ప్రభంజనం సృష్టిస్తోంది. ఈ క్రమంలోనే విడుదలైన రెండో రోజే ఈ సినిమాను సైతం పైరసీ భూతం వదల్లేదు. అయితే, సాధారణంగా సినిమాలు విడుదలైన కొత్తలో క్యామ్ రికార్డింగ్ ద్వారా వస్తుంటాయి. కానీ 'పెద్ది' సినిమాకు సంబంధించి ఆన్‌లైన్‌లో ఏకంగా హైక్వాలిటీ ప్రింట్లు అందుబాటులోకి రావడం చిత్ర పరిశ్రమను సైతం విస్మయానికి గురిచేస్తోంది. దీంతో ఈ చిత్రం డిజిటల్ వసూళ్లపై ఎక్కడ ప్రభావం పడుతుందోనని మెగా అభిమానులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. పైరసీ లింకులు సోషల్ మీడియాలో విచ్చలవిడిగా షేర్ అవుతుండటాన్ని గమనించిన మెగా ఫ్యాన్స్ వెంటనే అప్రమత్తమయ్యారు. ఆయా పైరసీ లింకులను వెంటనే ఇంటర్నెట్ నుంచి తొలగించేలా యాంటీ పైరసీ విభాగానికి సమాచారం ఇస్తున్నారు. అంతేకాకుండా, అత్యంత ప్రతిష్టాత్మకంగా రూపొందిన ఈ చిత్రం లింకులను లీక్ చేసి, పైరసీకి పాల్పడిన నిందితులపై సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేసి, కఠిన చర్యలు తీసుకోవాలని మూవీ టీమ్, పోలీసు యంత్రాంగాన్ని సోషల్ మీడియా వేదికగా కోరుతున్నారు.





## మనో ధైర్యం ఉన్నోడే నా మొగుడు

పర్సనల్ లైఫ్ గురించి రెజీనా కొన్ని ఆసక్తికర విషయాలు పంచుకుంది. 2020లో తనకు ఒక బ్రేకప్ అయిందని, ఆ తర్వాత మళ్లీ ప్రేమలో పడాలనే ఆలోచన రాలేదని తెలిపింది. ఆ బ్రేకప్ నుంచి తను చాలా నేర్చుకున్నానని, తన జీవితంలో భాగస్వామి ఉన్నా లేకపోయినా తన లైఫ్ స్టైల్ పెద్దగా మారదని పేర్కొంది. ప్రస్తుతం ఎవరితోనూ డేటింగ్ చేయడం లేదని, తనతో తానే గడుపుతూ సంతోషంగా ఉన్నానని చెప్పింది. తనకు కాబోయే వాడు ఇలాగే ఉండాలని పెద్దగా నిబంధనలు ఏమీ లేవని రెజీనాఅంటోంది. అయితే అతను మానసికంగా చాలా దృఢంగా ఉండాలని కోరుకుంటోంది. కేవలం శారీరక బలం కంటే మనోధైర్యం ఉన్న వ్యక్తికే తాను ప్రాధాన్యత ఇస్తానని వెల్లడించింది.




## అన్‌సోల్డ్‌గా కేఎల్ రాహుల్




భారత స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్‌ను మహారాజా ట్రోఫీ కేఎస్‌సీఏ టీ20 వేలంలో తీసుకునేందుకు ఏ ఫ్రాంచైజీ ఆసక్తి చూపలేదు. అతడు జాతీయ జట్టు తరఫున బరిలోకి దిగాల్సి ఉన్నందున ఈ టోర్నీకి అందుబాటులో ఉండే అవకాశాలు తక్కువగా ఉన్నాయి. దీంతో అతడిని ఎవరూ కొనుగోలు చేయలేదని తెలుస్తోంది. మహారాజా ట్రోఫీ ఐదో ఎడిషన్ జూన్ 20న ప్రారంభమై జులై 12న ముగియనుంది. మ్యాచ్‌లు మైసూరు, హుబ్బళ్లి, బెంగళూరు వేదికగా జరగనున్నాయి. అయితే, భారత బ్యాటర్ కరుణ్ నాయర్ ఈ వేలంలో అధిక ధర పలికాడు. అతడిని కోస్టల్ కింగ్స్ మంగళూరు ఫ్రాంచైజీ రూ.18 లక్షలకు సొంతం చేసుకుంది. తొలిసారిగా ఈ సీజన్‌లో శివమొగ్గ యోదాస్ పాలుపంచుకోనుంది. ఆ ఫ్రాంచైజీ ఐపీఎల్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్‌కు ప్రాతినిధ్యం వహించిన రవిచంద్రన్ స్మ్రాన్‌ను వేలంలో రూ.15.75 లక్షలకు దక్కించుకుంది. అభినవ్ మనోహర్‌ను హుబ్లీ టైగర్స్ రూ.13.50 లక్షలకు, మయాంక్ అగర్వాల్‌ను రూ.11.50 లక్షలకు దక్కించుకుంది. పంజాబ్ కింగ్స్‌కు చెందిన పేసర్ వైశాఖ్ విజయ్ కుమార్‌ను మైసూర్ వారియర్స్ రూ.8.25 లక్షలకు వేలంలో సొంతం చేసుకుంది. అలాగే దేవ్‌దత్ పడిక్కల్, ప్రసిద్ధ్ కృష్ణను చెరో రూ.2.5లక్షలకు మైసూర్ వారియర్స్ సొంతం చేసుకుంది. అయితే, జాతీయ జట్టు తరఫున వారు మ్యాచ్‌లు ఆడాల్సి ఉన్నందున ఈ టోర్నీకి పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండే అవకాశాలు తక్కువే.



## కంగారులకు పాక్ షాక్

### వన్డే సిరీస్ కైవసం

ఆస్ట్రేలియా జట్టుకు ఊహించని షాక్ ఇచ్చింది పాకిస్తాన్. ఈ రెండు జట్ల మధ్య 3 వన్డేల సిరీస్ జరగగా... 2-1 తేడాతో సిరీస్ కైవసం చేసుకుంది. మొదటి వన్డేలో గెలిచిన పాకిస్తాన్, రెండో వన్డేలో ఓడిపోయింది. ఇక గురువారం రోజున ఆస్ట్రేలియాతో మూడో వన్డేలో తలపడింది. లాహోర్ గడాఫీ స్టేడియం వేదికగా జరిగిన ఈ మ్యాచ్ లో నాలుగు వికెట్ల తేడాతో విజయం సాధించి, సిరీస్ కైవసం చేసుకుంది పాక్. ఈ మ్యాచ్ లో ఆస్ట్రేలియా మొదటి బ్యాటింగ్ చేసి 157 పరుగులకే ఆలౌట్ అయింది. ఈ లక్ష్యాన్ని 41.5 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి ఛేదించింది. దీంతో నాలుగు వికెట్ల తేడాతో గెలిచిన పాకిస్తాన్, వన్డే సిరీస్ కైవసం చేసుకుంది. ఈ విజయంతో పాక్ కొత్త కెప్టెన్ షాహీన్ అఫ్రిదిపై ప్రశంసల వర్షం కురుస్తోంది.




## యువ నాయకత్వానికే

# బీసీసీఐ మొగ్గు!?

### టీ20 కెప్టెన్సీ నుంచి తప్పించే దిశగా బీసీసీఐ ఆలోచిస్తున్నట్లు ప్రచారం

**ఐపీఎల్ 2026 సీజన్ ముగిసిన అనంతరం భారత క్రికెట్ అభిమానులు అంతర్జాతీయ సిరీస్‌ల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అయితే ఈ సమయంలో టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌కు సంబంధించిన ఓ వార్త క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది.**

**వరుస విజయాలతో భారత జట్టును అగ్రస్థానంలో నిలబెట్టిన సూర్యను టీ20 కెప్టెన్సీ నుంచి తప్పించే దిశగా బీసీసీఐ ఆలోచిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది.రోహిత్ శర్మ అంతర్జాతీయ టీ20లకు వీడ్కోలు పలికిన తర్వాత సూర్యకుమార్ యాదవ్ టీ20 జట్టు పగ్గాలు చేపట్టాడు.**

అతని నాయకత్వంలో భారత్ వరుసగా ఎనిమిది ద్వైపాక్షిక సిరీస్‌లను కైవసం చేసుకుంది. అంతేకాదు 2025 ఆసియా కప్‌తో పాటు 2026 టీ20 వరల్డ్‌కప్‌ను కూడా గెలుచుకుని ప్రపంచ క్రికెట్‌లో తన నాయకత్వ ప్రతిభను చాటుకున్నాడు. వరుసగా రెండు ఐసీసీ ట్రోఫీలను అందించిన కెప్టెన్‌ను కేవలం కొద్ది నెలల వ్యవధిలోనే మార్చాలనే ఆలోచన అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఐసీసీ ట్రోఫీ గెలిచిన తర్వాత కూడా కెప్టెన్సీ కోల్పోయిన భారత కెప్టెన్ల జాబితాలో రోహిత్ శర్మ పేరు ముందుంటుంది. విరాట్ కోహ్లీ తర్వాత 2021లో వన్డే జట్టు కెప్టెన్‌గా బాధ్యతలు చేపట్టిన రోహిత్, భారత జట్టుకు ఎన్నో చిరస్మరణీయ విజయాలు అందించాడు. అతని నాయకత్వంలో భారత్ ఆసియా కప్‌లు గెలవడమే కాకుండా 2023 వన్డే వరల్డ్‌కప్ ఫైనల్‌కు చేరింది. అనంతరం ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీని కూడా కైవసం చేసుకుని జట్టును మరోసారి ప్రపంచ ఛాంపియన్‌గా నిలిపాడు.వన్డే కెప్టెన్‌గా రోహిత్ అద్భుతమైన విజయశాతం నమోదు చేసినప్పటికీ, భవిష్యత్ ప్రణాళికలను దృష్టిలో పెట్టుకుని సెలక్టర్లు నాయకత్వ బాధ్యతలను యువ ఆటగాడు శుభ్‌మన్ గిల్‌కు అప్పగించారు. 2027 వరల్డ్‌కప్‌ను లక్ష్యంగా పెట్టుకుని తీసుకున్న నిర్ణయమిదేనని అప్పట్లో సెలక్షన్ కమిటీ స్పష్టం చేసింది. ఇప్పుడు సూర్యకుమార్ యాదవ్ విషయంలోనూ సెలక్టర్లు ఇదే తరహా ఆలోచనలో ఉన్నట్లు తెలుస్తోంది. జట్టు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని యువ నాయకత్వాన్ని తీర్చిదిద్దాలనే ఉద్దేశంతో బీసీసీఐ ముందడుగు వేస్తున్నట్లు సమాచారం. అందులో భాగంగా ఐపీఎల్‌లో అద్భుత కెప్టెన్సీ నైపుణ్యాన్ని ప్రదర్శించిన శ్రేయస్ అయ్యర్‌ను టీ20 జట్టు నాయకుడిగా ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయని వార్తలు వినిపిస్తున్నాయి. పంజాబ్ కింగ్స్‌కు విజయాలను అందించి తన నాయకత్వ సామర్థ్యాన్ని నిరూపించుకున్న శ్రేయస్ అయ్యర్ ఇప్పుడు టీమిండియా టీ20 కెప్టెన్సీ రేసులో ముందంజలో ఉన్నట్లు తెలుస్తోంది.

## రషీద్ ఖాన్ రిటైర్మెంట్!?




టీమిండియా, అఫ్గానిస్తాన్ మధ్య ఏకైక టెస్టు మ్యాచ్ ప్రారంభానికి ముందు ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. అఫ్గానిస్తాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ టెస్టు రిటైర్మెంట్‌పై త్వరలో కీలక నిర్ణయం తీసుకోనున్నట్లు తెలుస్తోంది. అయితే భారత్‌తో జరగనున్న ఏకైక టెస్టు మ్యాచ్‌కు రషీద్ ఖాన్ దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. టెస్టు క్రికెట్‌లో చాలాసేపు బౌలింగ్ చేయాల్సి రావడంతో, దీర్ఘకాలిక వెన్నునొప్పి వల్ల ఎక్కువ బంతులు వేయలేనని రషీద్ ఖాన్ గతం లోనే స్పష్టం చేశాడు. అయితే తాజాగా రషీద్ ఖాన్ టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలకనున్నాడా అనే దానిపై ఆ జట్టు కోచ్ రిచర్డ్ ఫైబస్ స్పం దించారు. 'రషీద్ ఖాన్ దీర్ఘకాలిక నడుమునొప్పితో బాధపడుతున్నాడు. టెస్టు క్రికెట్‌కు దూరమవ్వాలని రషీద్ ఎప్పుడో నిర్ణయించుకున్నాడు. అతడు దేశంతో పాటు చాలా ప్రైవేటు లీగ్స్‌లో ఆడుతుంటాడు. అయితే రషీద్ మా జట్టుకు ఫ్రంట్‌లైన్ బౌలర్ కావడంతో అతడిని జాగ్రత్తగా చూసుకోవాల్సిన అవసరముంది. టెస్టు క్రికెట్‌కు దూరంగా ఉండాలని భావిస్తున్న రషీద్‌తో నేను రెడ్‌బాల్ క్రికెట్‌లో కొనసాగాలని అడుగుతాను. కానీ ఆడతాడా లేదా అన్నది అతడి నిర్ణయంపైనే ఆధారపడి ఉంది. 27 ఏళ్ల రషీద్ ఖాన్ 2023 వన్డే ప్రపంచకప్‌కు ముందు నుంచే వెన్నుగాయం తీవ్రంగా ఇబ్బంది పెడుతూ వస్తోంది. అప్పటినుంచి ఎక్కువసేపు బౌలింగ్ చేయడంలో రషీద్ ఖాన్ తీవ్రంగా ఇబ్బంది పడుతూ వస్తున్నాడు. అయితే ఈ ఏడాది ఏప్రిల్‌లో తాను టెస్టు క్రికెట్‌కు వీడ్కోలు పలకాలని నిర్ణయించుకున్నా అని రషీద్ ఖాన్ తెలిపాడు. కాబట్టి టెస్టు క్రికెట్‌లో ఆడాలా వద్దా అనేది అతడి ఇష్టానికే వదిలేస్తున్నాం' అని తెలిపాడు. కాగా రషీద్ ఖాన్ గైర్హాజరీలో అఫ్గానిస్తాన్ జట్టుకు హష్మతుల్లా షాహిది జట్టును నడిపించనున్నాడు. జట్టులో రహమనుల్లా జద్రన్, అఫ్సర్ జజాయ్, ఇక్రమ్ అలీఖిలి, అజ్మతుల్లా ఒమర్‌జయ్‌లు కీలక ఆటగాళ్లుగా ఉన్నారు. ఇక అఫ్గానిస్తాన్ 2018లో టెస్టు హోదా పొందింది. అప్పటినుంచి 12 మ్యాచ్‌లాడగా, నాలుగు విజయాలు, ఏడు ఓటములు, ఒక డ్రా నమోదు చేసింది.

## ఆటకు కోహ్లీ ఆర్నెల్లు దూరం!

టీమిండియా స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ గాయం కారణంగా ఇంగ్లండ్‌తో వన్డే సిరీస్‌కు దూరమయ్యే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. ఇప్పటికే కాలి పిక్క కండరాల గాయంతో




అఫ్గానిస్తాన్‌తో వన్డే సిరీస్‌కు దూరమైన కోహ్లీ తాజాగా గాయం తీవ్రత ఎక్కువగా ఉందని తేలింది. దీంతో కోహ్లీ కోలుకోవడానికి ఆరు నెలల సమయం పట్టే అవకాశముందని టైమ్స్ ఆఫ్ ఇండియా నివేదిక పేర్కొంది. దీంతో జూలైలో ఇంగ్లండ్‌తో ప్రారంభం కానున్న వన్డే సిరీస్‌కు కోహ్లీ దూరమైనట్లే. అయితే దీనిపై బీసీసీఐ అధికారిక ప్రకటన విడుదల చేయాల్సి ఉంది. 'కోహ్లీ తొడ కండరంలో చీలిక వచ్చింది. ఈ గాయానికి శస్త్రచికిత్స అవసరం లేదు. అయితే ఇది నయం కావడానికి మాత్రం సుమారు ఆరు వారాల సమయం పట్టనుంది. దీనిలో భాగంగా బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో కోహ్లీ పునరావాసం పొందే అవకాశముంది. కాగా కోహ్లీ తన గాయంపై ముంబైలోని కోకిలాబెన్ ధీరూభాయ్ అంబానీ ఆసుపత్రిలోని ప్రఖ్యాత ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ దిన్‌షా పర్దివాలాను టెలి-కన్సల్ట్ అయ్యాడు. ఎంఆర్ఐ స్కాన్‌లో కండరాల్లో చీలిక వచ్చినట్లు రిపోర్ట్‌లో తేలింది.' అని పేర్కొంది. ఇదిలా ఉండగా, అఫ్ఘనిస్తాన్‌తో జరగనున్న వన్డే సిరీస్‌కు ముందు ఫిట్‌నెస్ మదింపు కోసం రోహిత్ శర్మ 8న బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)కి హాజరుకానున్నట్లు కూడా ఆ నివేదిక పేర్కొంది . ఈ సిరీస్ కోసం రోహిత్‌ను జట్టులోకి తీసుకున్నప్పటికీ, అతని లభ్యత పూర్తిగా ఫిట్‌నెస్ పరీక్షల ఫలితాలపై ఆధారపడి ఉంటుంది.



## ప్లేయింగ్ ఎలెవన్ ఎంపిక కష్టమవుతోంది: గంభీర్

అఫ్ఘానిస్థాన్ క్రికెట్ జట్టు శనివారం నుంచి భారత్‌లో పర్యటించనుంది. ఇందులో భాగంగా ముల్లాన్‌పూర్ వేదికగా ఏకైక టెస్ట్ మ్యాచ్ రేపటి నుంచి ప్రారంభం కానుంది. అనంతరం మూడు వన్డేలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో టెస్ట్ జట్టు ఎంపిక గురించి, మ్యాచ్‌కు ముందు నిర్వహించిన విలేకరుల సమావేశంలో టీమ్ఇండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ కీలక వ్యాఖ్యలు చేశాడు. 'తుది జట్టును ఎంపిక చేయడం చాలా కష్టమైన పని. భారత డ్రెస్సింగ్‌రూంలో చాలా టాలెంట్ ఉంది. వీరిలోంచి ప్లేయింగ్ ఎలెవన్‌ను ఎంచుకోవడం అంత తేలిక కాదు. భారత్‌లో అద్భుతమైన ప్రతిభ ఉంది. అందుకే ఏ కోచ్‌కైనా, టీమ్ మేనేజ్‌మెంట్‌కైనా.. ఏ ఫార్మాట్లో అయినా సరే.. బెస్ట్ ప్లేయింగ్ ఎలెవన్‌ను ఎంచుకోవడం కఠినం. ఇది భారత క్రికెట్ గొప్పతనం. అయితే టెస్ట్ క్రికెట్ కాస్త విభిన్నం. ఈ ఫార్మాట్‌లో రాణించాలంటే మెలకువలు, టెక్నిక్ మాత్రమే సరిపోవు. ఒత్తిడిని తట్టుకోగలగాలి. ఆటను అర్థం చేసుకోవాలి. కొన్నిసార్లు త్యాగాలూ చేయాల్సి ఉంటుంది. విజయవంతమైన టెస్ట్ క్రికెటర్‌గా రూపుదిద్దుకోవాలంటే ఇవన్నీ అవసరం. మేం యువ క్రికెటర్లతో కూడా ఇదే విషయం మాట్లాడాం. జట్టుకోసం త్యాగాలు చేసేందుకూ సిద్ధంగా ఉండాలని చెప్పాం. అప్పుడే టెస్టుల్లో విజయవంతమైన జట్టు రూపొందుతుంది' అని గౌతమ్ గంభీర్ విశ్లేషించాడు.

## గుకేశ్‌కు ప్రజ్ఞానంద షాక్

నార్వే చెస్ టోర్నీలో భారతీయ ప్లేయర్ ఆర్ ప్రజ్ఞానంద దూసుకెళ్తున్నాడు. ఆ టోర్నీలో ప్రస్తుతం అతను రెండో స్థానంలో నిలిచాడు. అయితే వరల్డ్ చాంపియన్, మరో భారత ఆటగాడు డీ గుకేశ్‌పై అద్భుతమైన విజయాన్ని ప్రజ్ఞానంద నమోదు చేశాడు. కీలకమైన మ్యాచ్‌లో కేవలం 34 ఎత్తుల్లోనే గుకేశ్‌ను మట్టికరిపించాడు. రెండు రోజుల క్రితమే గుకేశ్ తన 20వ పుట్టిన రోజు జరుపుకున్నాడు. అయితే ఈ విక్టరీ ప్రజ్ఞానందకు ప్రతీకార విజయం అవుతుంది. ఈ టోర్నీలోనే నాలుగవ రౌండ్‌లో గుకేశ్ చేతిలో ప్రజ్ఞానంద ఓడిపోయారు. గుకేశ్‌పై గెలుపుతో టైటిల్ రేసుకు ప్రజ్ఞానంద చేరువయ్యారు. వరుసగా మూడు విక్టరీలతో మళ్లీ ఊపందుకున్నాడు. మూడు రోజుల క్రితం వెనుకబడ్డ నేను ఇప్పుడు టైటిల్ రేసులో ఉన్నట్లు ప్రజ్ఞానంద తెలిపారు. గత ఏడాది నార్వే చెస్ టోర్నీలో గుకేశ్, కార్ల్‌సన్ మధ్య తీవ్ర పోటీ ఉండే. అయితే ఈ ఏడాది కార్ల్‌సన్ పెద్దగా పర్ఫార్మ్ చేయలేకపోయాడు. గుకేశ్‌కు 8 పాయింట్లు ఉన్నాయి. పాయింట్ల పట్టికలో వెస్లే అగ్రస్థానంలో ఉన్నాడు. అతను 15.5 పాయింట్లతో దూసుకెళ్తున్నాడు. ప్రజ్ఞానంద 15 పాయింట్లతో టైట్ ఫైట్ ఇస్తున్నాడు. ఇక మూడవ స్థానంలో 14.5 పాయింట్లతో అలిరెజా ఫిరౌజా ఉన్నారు.

## వైభవ్‌ను జాతీయ జట్టులో ఆడించాలి: మాజీలు

ఐపీఎల్ 2026 సీజన్ మొత్తం రాజస్తాన్ రాయల్స్ ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ గురించే చర్చ నడిచింది. ఈ సీజన్‌లో 16 మ్యాచ్‌లాడిన వైభవ్ 237 స్ట్రైక్‌రేట్‌తో 776 పరుగులు సాధించి ఆరెంజ్ క్యాప్ సొంతం చేసుకోవడంతో పాటు మోస్ట్ వాల్యుబల్ ప్లేయర్, ఎమర్జింగ్ ప్లేయర్ అవార్డులను సొంతం చేసుకున్నాడు. అతడి బ్యాటింగ్ విధ్వంసంపై దిగ్గజాలు సహా మాజీ క్రికెటర్లు అభినందించారు. వైభవ్‌ను జాతీయ జట్టుకు ఎంపిక చేయాలని కూడా డిమాండ్లు వినిపించాయి. అయితే వైభవ్ సూర్యవంశీ క్రేజ్ ఇప్పుడు విదేశాలకు కూడా పాకింది. విదేశాలకు చెందిన మాజీ క్రికెటర్లు కూడా వైభవ్‌ను టీమిండియాకు ఎంపిక చేయాలని తమ అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తాజాగా ఇంగ్లండ్, న్యూజిలాండ్ మధ్య లార్డ్స్ వేదికగా జరుగుతున్న తొలి టెస్టులోనూ వైభవ్ సూర్యవంశీ గురించి ప్రస్తావన వచ్చింది. మ్యాచ్ తొలిరోజు మధ్యలో వర్షం పడడంతో విరామ సమయంలో కామెంటేటర్ సైమన్ డౌల్ వైభవ్ సూర్యవంశీ బ్యాటింగ్ ప్రస్తావన తీసుకొచ్చాడు. అతని బ్యాటింగ్ అద్భుతమంటూ, నేరుగా భారత జట్టులోకి తీసుకుంటారేమోనని పేర్కొన్నాడు.



ఈవార్తలు ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు 12
శనివారం 6-6-2026, జగిత్యాల

నేటి ఈవార్తలు

## సంపాదకీయం Editorial

# బీజేపీలో ఉత్తరాది వర్సెస్ దక్షిణాది

తమిళనాడులో బీజేపీకి గుర్తింపు తీసుకొచ్చిన కీలక నేత, మాజీ ఐపీఎస్ అధికారి అన్నామలై పార్టీకి రాజీనామా చేయడం భారత రాజకీయాల్లో సంచలనంగా మారింది. కేవలం ఒక నాయకుడు పార్టీని వీడటం మాత్రమే కాదు, బీజేపీ అంతర్గత వ్యవస్థలో దక్షిణాది నాయకత్వం ఎదుర్కొంటున్న అసంతృప్తికి ఇది ప్రతీకగా కనిపిస్తోంది. రాజీనామా అనంతరం ఆయన కొత్త రాజకీయ ఉద్యమానికి శ్రీకారం చుట్టడం, పలువురు తమిళనాడు బీజేపీ నేతలు కూడా పార్టీని వీడడం ఈ పరిణామాల తీవ్రతను సూచిస్తున్నాయి. అన్నామలై ఎదుగుదల అసాధారణం. ద్రవిడ రాజకీయాల కోటగా భావించే తమిళనాడులో ఆయన బీజేపీకి ఒక ప్రత్యేక గుర్తింపును తెచ్చారు. యువతలో ఆదరణ సంపాదించారు. రాష్ట్రంలో పార్టీ ఓటు బ్యాంకును పెంచే ప్రయత్నం చేశారు. అయితే రాష్ట్ర రాజకీయ వాస్తవాల కంటే ఢిల్లీ నాయకత్వం నిర్ణయాలకు ఎక్కువ ప్రాధాన్యం ఇవ్వడం, స్థానిక నాయకుల అభిప్రాయాలకు తగిన గౌరవం దక్కకపోవడం వంటి అంశాలు చివరకు విభేదాలకు దారితీసినట్లు కనిపిస్తోంది. బీజేపీ దేశవ్యాప్తంగా విస్తరించిన పార్టీ అయినప్పటికీ, దాని నాయకత్వ నిర్మాణం ఇప్పటికీ ఉత్తర భారత కేంద్రితంగానే ఉందన్న విమర్శ చాలాకాలంగా వినిపిస్తోంది. దక్షిణాది రాష్ట్రాల్లో రాజకీయ సంస్కృతి, సామాజిక సమీకరణాలు, భాషా భావోద్వేగాలు భిన్నంగా ఉంటాయి. అలాంటి ప్రాంతాల్లో స్థానిక నాయకులకు స్వేచ్ఛ, నిర్ణయాధికారం ఇవ్వకుండా కేంద్రీకృత రాజకీయాలను అమలు చేయాలనుకుంటే ఘర్షణలు సహజం. అన్నామలై నిష్క్రమణ ఆ అంతర్గత వైరుధ్యాలనే బయటపెట్టిందని చెప్పవచ్చు. ఒకవైపు పార్టీ విస్తరణ కోసం ప్రాంతీయ ముఖచిత్రాలను ప్రోత్సహిస్తామని చెప్పడం, మరోవైపు వారు బలపడిన తర్వాత వారి రాజకీయ దృక్పథాలకు ప్రాధాన్యం ఇవ్వకపోవడం మధ్య వైరుధ్యం కనిపిస్తోంది. నాయకత్వం కంటే విధేయతకే ఎక్కువ విలువ ఇస్తున్నారా అనే ప్రశ్న కూడా తలెత్తుతోంది. తమిళనాడులో అన్నామలై వెళ్లిపోవడం బీజేపీకి తక్షణ నష్టమా కాదా అనేది కాలమే నిర్ణయిస్తుంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం. దక్షిణాదిలో పార్టీని విస్తరించాలంటే అక్కడి నాయకులను కేవలం ప్రచార ముఖచిత్రాలు గా కాకుండా నిర్ణయాత్మక భాగస్వాములుగా గుర్తించాల్సిందే. లేకపోతే ఉత్తరాది నాయకత్వం--దక్షిణాది ఆకాంక్షల మధ్య అంతరం మరింత పెరిగే ప్రమాదం ఉంది. అన్నామలై రాజీనామా ఒక వ్యక్తి రాజకీయ ప్రయాణంలో మలుపు మాత్రమే కాదు; జాతీయ పార్టీల్లో ప్రాంతీయ స్వరాలకు ఎంత స్థానం ఉందనే పెద్ద ప్రశ్నను కూడా దేశ రాజకీయాల ముందుంచింది.



# వృద్ధి-ద్రవ్యోల్బణం సమతుల్యత

**దేశ ఆర్థిక వ్యవస్థ ప్రస్తుతం ఒక సున్నితమైన దశలో ఉంది. ఒకవైపు ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఆర్థిక అనిశ్చితులు, మరోవైపు పెరుగుతున్న చమురు ధరలు, భౌగోళిక ఉద్రిక్తతలు భారత ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్బీఐ) రెపో రేటును 5.25 శాతంగానే కొనసాగిస్తూ తీసుకున్న నిర్ణయం శ్లాఘించదగ్గది.**


వడ్డీ రేట్లలో మార్పులు చేయకుండా ఉండటం ద్వారా ఆర్థిక వృద్ధికి ఊతమివ్వాలన్న లక్ష్యంతో పాటు ద్రవ్యోల్బణాన్ని అదుపులో ఉంచాలన్న ద్వంద్వ బాధ్యతను ఆర్బీఐ సమతుల్యం చేయడానికి ప్రయత్నించినట్లు కనిపిస్తోంది. రెపో రేటు అనేది దేశంలో రుణాల ధరను నిర్ణయించే కీలక సాధనం. దీనిని తగ్గిస్తే బ్యాంకులు తక్కువ వడ్డీకి రుణాలు అందించగలవు. పెంచితే రుణాలు ఖరీదవుతాయి. ప్రస్తుతం దేశీయ డిమాండ్‌ను దెబ్బతీయకుండా, పరిశ్రమలు మరియు వ్యాపార రంగాలకు స్థిరత్వం కల్పించాలనే ఉద్దేశంతో ఆర్బీఐ యథాతథ విధానాన్ని ఎంచుకుంది. అయితే ఇది కేవలం వడ్డీ రేటును స్థిరంగా ఉంచిన నిర్ణయం మాత్రమే కాదు; భవిష్యత్తులో ఎదురయ్యే సవాళ్లపై ఒక హెచ్చరిక కూడా. ఆర్బీఐ తాజా సమీక్షలో దేశ ఆర్థిక వృద్ధి అంచనాలను తగ్గించడం గమనార్హం. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో మందగమనం, ప్రధాన దేశాల్లో వాణిజ్య అనిశ్చితులు, అంతర్జాతీయ మార్కెట్లలో చమురు ధరల పెరుగుదల వంటి అంశాలు భారత వృద్ధి అవకాశాలపై ప్రభావం చూపుతున్నాయని కేంద్ర బ్యాంక్ అంచనా వేస్తోంది. వృద్ధి రేటు తగ్గితే ఉపాధి అవకాశాలు, పెట్టుబడులు, వినియోగ వ్యయం వంటి రంగాలపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉంటుంది. అందుకే ప్రభుత్వంతో పాటు ప్రైవేట్ రంగం కూడా ఉత్పాదక పెట్టుబడులపై మరింత దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

మరోవైపు ద్రవ్యోల్బణ అంచనాలను పెంచడం ఆందోళన కలిగించే అంశం. ముఖ్యంగా ముడి చమురు ధరల పెరుగుదల రవాణా, విద్యుత్, తయారీ రంగాల వ్యయాలను పెంచుతుంది. దాని ప్రభావం చివరకు సాధారణ వినియోగదారుడిపై పడుతుంది. ఆహార వస్తువులు, నిత్యావసరాల ధరలు పెరిగితే మధ్యతరగతి, పేద వర్గాలపై భారమవుతుంది. అందువల్ల ధరల నియంత్రణలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మరింత అప్రమత్తంగా వ్యవహరించాలి. రూపాయి బలోపేతానికి ఆర్బీఐ ప్రకటించిన చర్యలు కూడా ప్రాధాన్యత సంతరించుకున్నాయి. బలమైన రూపాయి దిగుమతుల వ్యయాన్ని తగ్గించడంతో పాటు విదేశీ పెట్టుబడిదారుల్లో విశ్వాసాన్ని పెంచుతుంది. అయితే రూపాయి విలువను కృత్రిమంగా నిలబెట్టడం కాకుండా, విదేశీ మారక నిల్వలు, ఎగుమతుల పెరుగుదల, పెట్టుబడుల ప్రవాహం వంటి అంశాల ద్వారా దీర్ఘకాలిక స్థిరత్వాన్ని సాధించాలి. మొత్తంగా చూస్తే, ఆర్బీఐ తాజా నిర్ణయం జాగ్రత్తతో కూడిన ఆర్థిక వ్యూహంగా కనిపిస్తోంది. ప్రస్తుతం ప్రపంచ పరిస్థితులు అనుకూలంగా లేనందున వడ్డీ రేట్లలో హడావుడి మార్పులకు వెళ్లకుండా స్థిరత్వాన్ని ఎంచుకుంది. అయితే వృద్ధి మందగమనం, ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు ఒకేసారి పెరుగుతున్న సంకేతాలు కనిపిస్తున్న నేపథ్యంలో ప్రభుత్వం, ఆర్బీఐ, పరిశ్రమలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉంది. ఆర్థిక స్థిరత్వం కాపాడుకుంటూనే వృద్ధిని ప్రోత్సహించడం రాబోయే నెలల్లో దేశానికి ప్రధాన సవాలుగా మారనుంది.

**- శ్రీనివాస్ దీకొండ,**
**ఆర్థిక నిపుణుడు, హైదరాబాద్**

# ప్రాంతీయ పార్టీలు బలి

**భారత ప్రజాస్వామ్య వ్యవస్థకు ప్రపంచవ్యాప్తంగా ప్రత్యేక గుర్తింపు తీసుకొచ్చిన అంశాల్లో రాజకీయ వైవిధ్యం ఒకటి. భాషలు, సంస్కృతులు, ప్రాంతీయ ఆకాంక్షలు, సామాజిక వర్గాల ప్రయోజనాలను ప్రతిబింబించే ప్రాంతీయ పార్టీలు దేశ రాజకీయ వ్యవస్థను బలోపేతం చేశాయి. కేంద్రంలో ఎవరు అధికారంలో ఉన్నా రాష్ట్రాల స్వరాన్ని వినిపించడంలో, సమాఖ్య స్ఫూర్తిని కాపాడడంలో ప్రాంతీయ పార్టీల పాత్ర కీలకంగా నిలిచింది. అయితే ప్రస్తుతం దేశ రాజకీయాలు రెండు జాతీయ పార్టీల చుట్టూ కేంద్రీకృతమవుతున్న క్రమంలో ప్రాంతీయ పార్టీల ఉనికి ప్రశ్నార్థకంగా మారుతోంది.**



ఒకవైపు బీజేపీ దేశవ్యాప్తంగా తన విస్తరణ వ్యూహాన్ని దూకుడుగా అమలు చేస్తుంటే, మరోవైపు కాంగ్రెస్ తిరిగి తన పూర్వ వైభవాన్ని సాధించేందుకు ప్రయత్నిస్తోంది. ఈ రెండు జాతీయ పార్టీల రాజకీయ పోరాటంలో ప్రాంతీయ పార్టీలు బలిపశువులుగా మారుతున్న పరిస్థితి కనిపిస్తోంది. ఒకప్పుడు రాష్ట్ర రాజకీయాలను శాసించిన అనేక పార్టీలు నేడు తమ అస్తిత్వాన్ని కాపాడుకోవడానికి పోరాడుతున్నాయి. ఢిల్లీ రాజకీయాల్లో సంచలనం సృష్టించిన ఆమ్ ఆద్మీ పార్టీ, మహారాష్ట్రలో శివసేన, తెలంగాణలో బీఆర్ఎస్, పశ్చిమ బెంగాల్‌లో తృణమూల్ కాంగ్రెస్, బీహార్‌లో జేడీయూ, ఆర్జేడీ వంటి పార్టీలు నేడు తీవ్రమైన రాజకీయ ఒత్తిడిని ఎదుర్కొంటున్నాయి. కొన్ని చోట్ల అంతర్గత చీలికలు, మరికొన్ని చోట్ల జాతీయ పార్టీల దూకుడు, ఇంకొన్ని ప్రాంతాల్లో మారుతున్న రాజకీయ సమీకరణాలు వాటి బలహీనతకు కారణమవుతున్నాయి. ప్రత్యేకంగా ఇండియా కూటమిలో కాంగ్రెస్ వ్యవహరిస్తున్న తీరు అనేక ప్రశ్నలకు తావిస్తోంది. బీజేపీని ఎదుర్కోవడాని కి ప్రాంతీయ పార్టీలతో చేతులు కలిపిన కాంగ్రెస్, అదే సమయంలో తమ రాజకీయ స్థలాన్ని విస్తరించుకునే ప్రయత్నం చేస్తోంది. దీంతో మిత్రపక్షా లే కాంగ్రెస్ విస్తరణకు బలవుతున్నాయనే భావన కలుగుతోంది. ఎన్నికల సమయంలో మైత్రి పేరుతో కలిసిన పార్టీలు, ఎన్నికల తర్వాత తమ ఉనికిని కాపాడుకోవడానికి మళ్లీ పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. మరోవైపు బీజేపీ వ్యూహం కూడా భిన్నంగా లేదు. పొత్తుల పేరుతో ప్రాంతీయ పార్టీలతో కలిసి నడుస్తున్నా, క్రమంగా వాటి రాజకీయ ప్రాధాన్యాన్ని తగ్గిస్తూ తన సంస్థాగత బలాన్ని పెంచుకుంటోంది. మిత్రపక్షాలు బలపడటానికి కాకుండా, బీజేపీ విస్తరణకు వేదికలుగా మారుతున్నాయి. ఒకప్పుడు రాష్ట్ర రాజకీయాల్లో నిర్ణయాత్మక శక్తులుగా ఉన్న పార్టీలు నేడు జాతీయ పార్టీల అనుబంధ శక్తులుగా మారిపోతున్న దృశ్యం ఆందోళన కలిగిస్తోంది. ఈ పరిణామం ప్రజాస్వామ్యానికి శుభపరిణామం కాదు.

ప్రాంతీయ పార్టీలు కేవలం ఎన్నికల యంత్రాంగాలు కావు. అవి స్థానిక ప్రజల ఆశలు, ఆకాంక్షలు, ప్రాంతీయ అవసరాలు, భాషా సంస్కృతుల ప్రతినిధులు. జాతీయ పార్టీలకు కనిపించని సమస్యలను వెలుగులోకి తెచ్చే శక్తి వాటికి ఉంది. అలాంటి రాజకీయ శక్తులు బలహీనపడితే సమాఖ్య వ్యవస్థ స్ఫూర్తి కూడా దెబ్బతింటుంది. భారతదేశం వంటి విభిన్నతల దేశంలో ప్రజాస్వామ్యం బలంగా ఉండాలంటే రాజకీయ శక్తి వికేంద్రీకరణ అవసరం. అన్ని రాజకీయ నిర్ణయాలు కొద్ది పార్టీల చేతుల్లో కేంద్రీకృతమైతే అది ప్రజాస్వామ్య ఆరోగ్యానికి మంచిది కాదు. అధికార మార్పిడి కంటే కూడా ప్రత్యామ్నాయ రాజకీయ స్వరాలు బలంగా ఉండటమే ప్రజాస్వామ్యానికి అసలైన బలం. అందువల్ల బీజేపీ-కాంగ్రెస్ రాజకీయ పోరాటంలో ప్రాంతీయ పార్టీల ఉనికి క్షీణించడం కేవలం ఆయా పార్టీల సమస్యగా చూడరాదు. అది భారత ప్రజాస్వామ్య వైవిధ్యానికి, సమాఖ్య స్ఫూర్తికి, రాష్ట్రాల రాజకీయ స్వాతంత్ర్యానికి ఎదురవుతున్న సవాలుగా గుర్తించాలి. ప్రాంతీయ పార్టీల బలహీనత చివరికి దేశ ప్రజాస్వామ్య వ్యవస్థను బలహీనపరిచే ప్రమాదం ఉందనే విషయాన్ని రాజకీయ పక్షాలన్నీ గుర్తించాల్సిన అవసరం ఉంది.

**- వీరన్న సుందిళ్ల**
**కరీంనగర్**

రచయితలకు ఆహ్వానం!
సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..
అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!
పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.